# ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం

# వార్త

ఆదివారం 13, సెప్టెంబర్ 2026 | 16 పేజీలు




## లోక్ అదాలత్‌లో 583 కేసులు పరిష్కారం

రాజీ పడితే ఇరు వర్గాలు గెలిచినట్లే జడ్జి స్వరూప కాటం

16వ పేజీలో...



# మట్టి గణపతే ముద్దు

మట్టి వినాయకుని పూజించి పర్యావరణాన్ని కాపాడుదాం

పర్యావరణాన్ని కాపాడటం మనందరి బాధ్యత

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను తిరస్కరించండి

2వ పేజీలో...

ఖమ్మం కల్చరల్ సెప్టెంబర్ 12: (ప్రభాతవార్త) : వినాయక చవితి పండుగ రోజున మనమందరము సహజ సిద్ధమైన రంగులతో తయారైన మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే పండుగ రోజు వాడాలని, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను తిరస్కరించి, ఆ దిశగా భక్తులలో అవగాహన కల్పించడం మనందరి బాధ్యత. మట్టి విగ్రహాలను మాత్రమే పూజలో వినియోగించాలని పిల్లలు, పెద్దలు కూడా అవగాహన పెంచుకొని అందరి కి ఆదర్శంగా ఉండాలని అలాగే వినాయక చవితి పందిళ్ళల్లో డీ. జే లతో శబ్ద కాలుష్యాన్ని అరికట్టాలని ఇతరులకు ఇబ్బంది లేకుండా నిర్వాహకులు చూడాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

లైన్డ్ కెనాల్స్ అంటే అర్థమేమిటి

తొలి అనుమతుల్లోని 114 కిలోమీటర్ల నిడివి పూర్తయ్యేదెక్కడ

డ్యామేజ్‌పై సిడబ్ల్యుసి కి నివేదించారా

అది "మ్యాండేటరీ" కదా

ఇరిగేషన్ మంత్రి ఆదేశాల ఆంతర్యమేమి

పర్మిషన్ల కోసం సిసి శ్రీనివాసరెడ్డి అలుపెరుగక శ్రమించారు

పాలేరు దాకా క్లియరెన్స్‌లు వచ్చినట్లేనా

ఇంజనీర్లు ఉన్నాయనే అంటున్నారు

ప్రజల సందేహాలు నివృత్తి కావాలి



16 లో..

# రాజీవ్‌లింక్ "ప్రాథమిక ఇసి అనుమతుల్లో" భాగమేనా !?

మెయిన్ "డిస్ట్రిబ్యూషన్ హబ్" ఎక్కడిదాకా

పంప్‌హౌసెస్ ప్రమాణమా లేక కాలువల చివరిదాకానా

అశ్వారావుపేట/జూలూరుపాడు/ప్రభాతవార్త : సీతారామాలిఫ్ట్ ఇరిగేషన్ మెగా ప్రాజెక్ట్ నిర్మాణానికి కేంద్ర పర్యావరణ అటవీ క్లైమేట్ విభాగం వారిచ్చిన అనుమతుల్లో "రాజీవ్‌లింక్ కెనాల్" కూడా భాగమేనా అనే సందేహానికి నీటిపారుదల విభాగం తక్షణం స్పందించాలి. మేము ఈ పదాన్ని వాడామంటే ఇక్కడ ఇసి క్లియరెన్స్ లేదని అనడంలేదు. అదసలు మా ఉద్దేశ్యమే కాదు. కాకపోతే మొదటి నుంచీ అంటే 07.01.2019 తేదీన ఇసి ప్రైమరీ క్లియరెన్స్ జారీ చేసిన నాటినుంచీ ఈరోజు దాకా.,అందుబాటులో ఉన్న డాక్యుమెంట్ల ఆధారంగా అధ్యయనం చేసినప్పుడు కొన్ని అనుమానాలు సహజంగానే కలుగుతున్నాయి. అవేమిటో ఒక్కసారి విశ్లేషిద్దాం.

# వసతి గృహంలో ఎలుకల కలకలం!

విద్యార్థినులపై వరుస దాడులు.. భద్రత గాలిలో!

మూడు రోజుల వ్యవధిలో ఏడుగురికి గాయాలు.. ఆస్పత్రికి తరలించి చికిత్స

ఘటనలను ఉన్నతాధికారులకు చెప్పలేదన్న ప్రిన్సిపాల్.. 'చిన్న విషయమే' అంటూ సమర్థింపు

సారపాక, ప్రభాతవార్త: విద్యార్థినులకు భద్రత కల్పించాల్సి న వసతి గృహమే ఎలుకల దాడులకు నిలయంగా మారింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం సారపాక తెలంగాణ రాష్ట్ర మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల కళాశాల వసతి గృహంలో విద్యార్థినులపై ఎలుకలు వరుసగా దాడి చేసిన ఘటనలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి.



# ఏమి కొనేటట్టు లేదు...
# ఏమి తినేటట్టు లేదు

**ఉట్టికెక్కిన ఉల్లి, చక్కర ధరలు...**

**సామాన్యుడి నడ్డి విరుస్తున్న నిత్యావసర ధరలు..!**

**వంటింట్లో ధరల మంటలు - పండించే రైతుకు లాభం లేదు...**

**వినియోగదారుడికి ఊరట లేదు- దళారుల దందాతో ప్రజల జేబుకు చిల్లులు**

**పెరుగుదలైనక బ్లాక్ మార్కెట్ దందా..?**




**ఇల్లందు, ప్రభాతవార్త**

ఏమి కొనేటట్టు లేదు... ఏమి తినేటట్టు లేదు నాగులో నాగన్న... ఉల్లి ధర ఉట్టికెక్కి కన్నీళ్లు తెప్పిస్తోంది నాగులో నాగన్న..." ఒకప్పుడు జానపద గీతంగా వినిపించిన ఈ పాట నేడు తెలంగాణలో ప్రతి ఇంటి వాస్తవంగా మారింది. మార్కెట్‌కు వెళ్లిన సామాన్యుడు సంచి నిండా సరుకులు తెచ్చుకోలేక, జేబు మాత్రం ఖాళీ చేసుకుని ఇంటికి వస్తున్నాడు. కూరగాయల నుంచి పప్పుల వరకు, బియ్యం నుంచి నూనె వరకు, చక్కెర నుంచి పాల వరకు ప్రతి నిత్యావసర వస్తువు ధర ఆకాశాన్నంటుతోంది. పెరుగుతున్న ధరలు సామాన్య కుటుంబాల నెలవారీ బడ్జెట్‌ను పూర్తిగా తలకిందులు చేస్తున్నాయి.

**వంటింట్లో ధరల మంటలు...**

తెలంగాణలో ప్రతి ఇంట్లో ఇప్పుడు మొదలయ్యే చర్చ ఒక్కటే... "ఈరోజు ఏం వండాలి?" అనే ప్రశ్న కాదు..."ఏది కొనే స్థోమత ఉంది?" అన్న ప్రశ్న. మొన్నటి వరకు వంద రూపాయలకు ఐదు ఆరు కిలోలు వచ్చిన ఉల్లి ఇప్పుడు కిలో రూ.60 దాటింది. చక్కెర రూ.40 నుంచి రూ.70కు చేరింది. వంటనూనె ధరలు మరింత మంట పుట్టిస్తున్నాయి. పప్పులు, కూరగాయలు, పాలు, గుడ్లు... ఒక్కోటి ఒక్కోసారి పెరిగి సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయి.

**జీతం అదే... ఖర్చు రెట్టింపు**

ప్రభుత్వ ఉద్యోగి అయినా, ప్రైవేట్ ఉద్యోగి అయినా, కూలీ అయినా, రైతు అయినా... ఆదాయం పెద్దగా పెరగలేదు. కానీ నిత్యావసరాల ఖర్చు మాత్రం నెల నెలా పెరుగుతోంది. ఒక కుటుంబం నెలకు కొనుగోలు చేసే సరుకులకే వేల రూపాయల అదనపు భారం పడుతోంది. పేద, మధ్యతరగతి కుటుంబాలు అప్పులు చేసి ఇంటి ఖర్చులు నెట్టుకొచ్చే పరిస్థితి ఏర్పడుతోంది.

**రైతు ఏడుపు... వినియోగదారుడి బాధ**

ధరలు పెరిగాయని రైతు లాభపడుతున్నాడనుకోవడం కూడా పొరపాటే. రైతు పొలంలో పండించిన ఉల్లికి గిట్టుబాటు ధర దక్కదు. అదే ఉల్లి పట్టణ మార్కెట్‌లో మూడు నాలుగు రెట్లు ఎక్కువ ధరకు అమ్ముడవుతోంది. రైతు తక్కువకు అమ్ముతున్నాడు... వినియోగదారుడు ఎక్కువకు కొంటున్నాడు. మధ్యలో లాభం మాత్రం దళారులు, నిల్వదారులకే చేరుతోంది.

**ధరల వెనుక అసలు కారణాలేంటి?**

వర్షాభావం, అధిక వర్షాలు, పంటల దిగుబడులు తగ్గడం, రవాణా ఖర్చులు, అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం వంటి కారణాలు ఉన్నా... అవే ఒక్క కారణాలు కావు. అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత సృష్టించడం, సరఫరా వ్యవస్థలో లోపాలు, దళారుల ఆధిపత్యం కూడా ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా మారాయి. నియంత్రించాల్సిన వ్యవస్థలు నిద్రపోతే సామాన్యుడే బలవుతున్నాడు.

**ఇంధనం పెరిగితే... అన్నీ మండిపోతాయి**

పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగినప్పుడల్లా రవాణా వ్యయం పెరుగుతుంది. ఆ భారం కూరగాయల నుంచి నూనె వరకు ప్రతి వస్తువుపై పడుతుంది. గ్యాస్ సిలిండర్ ధర పెరిగితే ఇంటి వంట మాత్రమే కాదు... హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, చిన్న వ్యాపారాలన్నీ ధరలు పెంచేస్తాయి. చివరికి చాయ్ కప్పు కూడా సామాన్యుడికి భారమవుతోంది.

**ప్రభుత్వానికి ఇదే అసలైన పరీక్ష**

ధరల నియంత్రణ కేవలం ప్రకటనలతో కాదు... చర్యలతో సాధ్యం. బఫర్ నిల్వలను మార్కెట్‌లో విడుదల చేయాలి. రైతు బజార్లను బలోపేతం చేయాలి. రైతు నుంచి వినియోగదారుడికి నేరుగా సరుకులు చేరే వ్యవస్థను విస్తరించాలి. అక్రమ నిల్వలు, అధిక ధరలపై కఠిన చర్యలు తీసుకోవాలి. నూనెగింజల ఉత్పత్తిని పెంచి దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించాలి.

**సామాన్యుడి పళ్లెంలో అన్నం తగ్గితే... అభివృద్ధికి అర్థమేంటి?**

ఎన్ని అభివృద్ధి గణాంకాలు చెప్పినా... సామాన్యుడి పళ్లెంలో కూర తగ్గి, జేబులో ఖర్చు పెరిగితే ఆ అభివృద్ధికి విలువ ఉండదు. వంటింటి మంటను తగ్గించడం, రైతుకు గిట్టుబాటు ధర కల్పించడం, వినియోగదారుడికి ఉపశమనం ఇవ్వడం ప్రభుత్వాల అసలైన బాధ్యత. "ఏమి కొనేటట్టు లేదు... ఏమి తినేటట్టు లేదు నాగులో నాగన్న" అనే పాట ప్రజల నోట వినిపించకుండా చేసే రోజు ఎప్పుడు వస్తుందన్నదే ఇప్పుడు తెలంగాణ అంతా అడుగుతున్న ప్రశ్న.

**పెరుగుదల వెనక బ్లాక్ మార్కెట్ ధర..?**

ధరల పెరుగుదల వెనక వ్యాపారస్తులు కృత్రిమ కొరతను సృష్టించి బ్లాక్ మార్కెట్కు నిత్యవసర సరుకులను తరలిస్తున్నట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. పెట్రోల్ డీజిల్ ధరలు పెరగడంతో నిత్యవసర సరుకుల ధరలు సైతం పెరుగుతాయని ఊహాగానాలను సొమ్ము చేసుకుంటూ ముందస్తుగానే నిలువలను రహస్య ప్రాంతాల్లో నిలువ ఉంచి ధరలు పెరిగాయి అంటూ వారికి వారే ధరలు పెంచేస్తున్నారు. రవాణా చార్జీలు, వర్షాభావం పంటలు దిగుబడి లేకపోవడం తదితర సాకులను ఎత్తిచూపుతూ వచ్చిన సరుకులు బ్లాక్ మార్కెట్లోకి తరలించి ప్రజాల అవసరాలను సొమ్ము చేసుకునేందుకు వ్యాపారస్తులు సిండికేటుగా ఏర్పడి ధరలను పెంచుకుంటూ పోతున్నారు. సంబంధిత అధికారులు పెద్ద వ్యాపారస్తులకు సంబంధించిన గోదాములను ఆకస్మిక తనిఖీలు చేస్తే భారీ స్థాయిలో నిలువలు బయటపడే అవకాశం ఉంది ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టి సామాన్యుడికి నిత్యవసర దొరుకులు అందుబాటులో ఉండేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# నయా జమీందారులకు వ్యతిరేకంగా పోరాడాలి

**నాగారం సెప్టెంబర్ 12ప్రభాత వార్త**

నయా జమీందారులకు, కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాటమే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమరవీరులకు అర్పించే నిజమైన నివాళి అని సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలలో భాగంగా శనివారం మండల కేంద్రంలో నాటి పోరాట యోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు భూమి కోసం భుక్తి కోసం విముక్తి కోసం, వెట్టి చాకిరి రద్దుకై జరిగిన చారిత్రాత్మక వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం సువర్ణ అక్షరాలతో లిఖించదగినదని అన్నారు. సాధారణ మహిళగా ఉన్న చాకలి ఐలమ్మ విసునూర్ దేశముఖు రామచంద్రారెడ్డి ఆగడాల వ్యతిరేకంగా నిలబడి పోరాడిందన్నారు. కడివెండిలో దొడ్డి కొమరయ్య అమరత్వంతో తెలంగాణ పల్లెల్లో అగ్గి రాజు కొని సాయుధ పోరాటం ఉదతమై దొరలను, భూస్వాములను జాకీర్దారులను తరిమికొట్టి వారి గడీలను భూస్థాపితం చేయడం జరిగిందన్నారు. నైజాం నిరంకుశ పాలన నుంచి ప్రజల్ని విముక్తి చేసి 3000 గ్రామాలలో గ్రామ స్వరాజ్యాలను స్థాపించి 10లక్షల ఎకరాలను భూమిని పేదలకు పంచారని అన్నారు. నేడు కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నయా జమీందారు వ్యవస్థను ప్రోత్సహిస్తున్నదని చిన్న, సన్నకారు రైతుల నుంచి బలవంతంగా భూములను గుంజుకొని కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు కట్టబెడుతుందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

# మట్టి గణపతి ముద్దు

## మొదటి పేజీ తరువాయి..

మట్టి నుంచి వచ్చి మట్టిలోకే గణేశుడు మట్టి విగ్రహం నిమజ్జనం చేయడం ద్వారా జీవితం ప్రకృతి నుంచి పుట్టి తిరిగి ప్రకృతిని కలిసిపోతుందనే భావన తెలియజేస్తుంది. మట్టి విగ్రహాల తయారీ ద్వారా కుమ్మరి, శిల్పకళాకారుల వంటి స్థానిక కళాకారులకు ఉపాధి లభిస్తుంది. భవిష్యత్తు తరాలకు సందేశం: భక్తితో పాటు పర్యావరణాన్ని కాపాడే బాధ్యత కూడా భక్తులే పాటించాలని చైతన్యాన్ని బట్టి వినాయక విగ్రహాలు కలిగిస్తాయి. భక్తి ఉండాలి ప్రకృతి పై బాధ్యత కూడా ఉండాలి మట్టి వినాయకుని ప్రతిష్టిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం.ఒకవైపు వినాయక పందిళ్లలో డిజేలకు అనుమతి లేదని పోలీసు వారు చెబుతున్న నిర్వహకులు పెద్దగా ఆ విషయంలో ప్రాధాన్యత ఇవ్వడం లేదు. డి.జే లకు బదులుగా భజనలు చేసుకోవడం ఉత్తమమైన భక్తి మార్గం.ఎల్ నినో వా ప్రభావం వల్ల వర్షాలు కురవక వినాయక నిమజ్జనానికి నదులు, చెరువులు, వాగులలో నీరు సరి అయిన విధంగా లేకపోవడం వలన చిన్న,చిన్న మట్టి విగ్రహాల కు సాధ్యమైనంత వరకు నిర్వాహకులు ప్రాధాన్యతను ఈచ్చి ఈసారి ఏర్పాట్లు చేసుకుంటే నిమజ్జనానికి ఇబ్బందులు తలెత్తవు.

# భక్తి పారవశ్యంలో నిత్యకళ్యాణం

**శ్రీరామ సన్నిధిలో దంపతుల పూజలు..**

**వరుస సెలవులతో భారీగా తరలివచ్చిన భక్తజనం**

**భద్రాచలం కల్చరర్,ప్రభాతవార్త:**



దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి వారి సన్నిధిలో నిర్వహించే నిత్యకళ్యాణం భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని పంచింది. వరుస సెలవుదినం కావడంతో శనివారం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు భద్రాద్రికి తరలివచ్చారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన భక్తులు మిధున స్టేడియంలో నిర్వహించే నిత్యకళ్యాణంలో పాల్గొని పూజలు నిర్వహించారు. దంపతులు ప్రత్యేకంగా నిత్యకళ్యాణంలో పాల్గొని సీతారాముల ఆశీస్సులు పొందారు. వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ నిర్వహించిన కల్యాణ వేడుక భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తింది. సీతారాముల కల్యాణాన్ని తిలకించిన భక్తులు తమ కుటుంబాలకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని స్వామివారిని ప్రార్థించారు.శనివారం సెలవుదినం కావడంతో నిత్యకళ్యాణ మండపం భక్తులతో సందడిగా మారింది. సీతారాముల కల్యాణాన్ని ప్రత్యక్షంగా వీక్షించిన భక్తులు "జై శ్రీరామ్.. జై సీతారామ్" అంటూ భక్తి భావంతో తరించారు. భద్రాద్రి క్షేత్రానికి వచ్చిన ప్రతి భక్తుడికి నిత్యకళ్యాణం ఓ మధురమైన ఆధ్యాత్మిక అనుభూతిగా నిలిచింది. కళ్యాణ అనంతరం దంపతులు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు.

# తుంగతుర్తి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జాతీయ లోక్ అదాలత్

**తుంగతుర్తి. సెప్టెంబర్ 12. ప్రభాత వార్త**

జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు.ఈ సందర్భంగా కక్షిదారులను ఉద్దేశించి గౌరవ న్యాయమూర్తి మహమ్మద్ గౌస్ పాష మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 39ఏ ప్రకారం ఈ లోక్ అదాలత్ ను 1985 సంవత్సరంలో తీసుకురావడం జరిగిందన్నారు. న్యాయం అనేది పేదవాడికి, బలహీనుడికి అందాలని, ఎలాంటి ఖర్చులు లేకుండా రాజీ కుదిర్చి శాంతియుతంగా సమస్యలను పరిష్కరించడమే లోక్ అదాలత్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు.క్షణికావేశంలో సొంత అన్నదమ్ములు కూడా ఒకరినొకరు నరుక్కోవడం, కొట్టుకోవడం, చంపుకోవడం వంటి ఘటనలు జరుగుతున్నాయని, వీటన్నింటినీ నివారించాల్సిన అవసరం ఉందన్నారు.

# ప్రశాంతంగా గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలి

## డీఎస్పీ రవీంద్రారెడ్డి

**మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 12:**



వినాయక చవితి వేడుకలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని మణుగూరు డీఎస్పీ వి. రవీంద్రారెడ్డి అన్నారు. ఆయన శనివారం ప్రత్యేకంగా ప్రభాతవార్తతో మాట్లాడారు మణుగూరు సబ్ డివిజన్ లో ఉత్సవ కమిటీలు, ప్రజలు పోలీస్ శాఖ జారీ చేసిన భద్రతా మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.మండపాల వివరాలను ఆన్‌లైన్‌లో ఉచితంగా నమోదు చేసుకుని, ఆ ప్రతిని స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమర్పించాలన్నారు.ప్రజా రవాణా, అత్యవసర వాహనాలకు అంతరాయం కలగకుండా మండపాలు నిర్మించాలన్నారు. విద్యుత్ శాఖ అనుమతితోనే విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలన్నారు. మండపం వద్ద ఫైర్ ఎక్స్ టింగ్యుషర్లు, ఇసుక, నీటి డ్రమ్ములు అందుబాటులో ఉంచాలని, 24 గంటలూ నలుగురు వాలంటీర్లు అందుబాటులో ఉండటంతో పాటు సీసీ కెమెరాలు, పాయింట్ బుక్స్ ఏర్పాటు చేయాలన్నారు. నిర్వాహకుల ఫోన్ నంబర్లు ప్రదర్శించాలని అన్నారు. డీజేల వినియోగం, బాణసంచా కాల్చడం, మద్యం సేవించడం, జూదం, అసభ్యకర నృత్యాలు, ఇతరులను కించపరిచే ఫ్లెక్సీలు, నినాదాలపై పూర్తి నిషేధం ఉంటుందన్నారు. రాత్రి 10 గంటల వరకే సౌండ్ సిస్టమ్‌కు అనుమతి ఉందన్నారు. ఆసుపత్రులు, విద్యాసంస్థల వద్ద తక్కువ శబ్దంతో భక్తిగీతాలు మాత్రమే వేయాలన్నారు. నిర్ణీత సమయానికే విగ్రహ ప్రతిష్టాపన, నిమజ్జనం పూర్తి చేయాలన్నారు. శోభాయాత్ర వాహనాలు మంచి కండిషన్‌లో ఉండాలన్నారు. డ్రైవర్‌కు లైసెన్స్ తప్పనిసరి, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పరిసరాలు శుభ్రంగా ఉంచాలన్నారు.

మహిళలు, పిల్లలకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియా వదంతులను నమ్మవద్దని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే డయల్ 112 లేదా100 కి సమాచారం అందించాలని ఆయన కోరారు.

# బంగారు ఆభరణాల చోరీ కేసును ఛేదించిన పోలీసులు

## ఇద్దరు నిందితులు అరెస్ట్

దుమ్ముగూడెం: ప్రభాతవార్త (సెప్టెంబర్ 12)



దుమ్ముగూడెం మండల పరిధిలోని డబ్ల్యూ ఎల్ రేగుబల్లి గ్రామంలో గత రెండు రోజుల క్రితం ఒక ఇంట్లో జరిగిన బంగారు ఆభరణాలు దొంగతనం కేసును దుమ్ముగూడెం పోలీసులు తక్కువ సమయంలో చేదించారు భద్రాచలం ఎస్ డి పి ఓ కార్యాలయం వద్ద నిందితులను అరెస్టు చూపించి ఎస్ డి పి ఓ అరుణ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి ఈనెల 10వ తేదీన డబ్ల్యూ ఎల్ రేగుబల్లి గ్రామంలో ఒక ఇంట్లో బంగారు ఆభరణాలు చోరీ జరిగింది దుమ్ముగూడెం పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని వారివద్ద నుండి సొత్తును రికవరీ చేశారు నిందితుల వద్ద నుండి 21.60 గ్రాముల బంగారు ఆభరణాలు 196.23 గ్రాముల వెండి ఆభరణాలు మూడువేల నగదును దొంగతనానికి ఉపయోగించిన ఆటోను స్వాధీన పరుచుకున్నట్లు ఆయన తెలిపారు అలాగే ఈ చోరీ కేసులో నిందితులైన ఇసంపల్లి హనుమంతరావు మైపా జోగారావు లను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు ఆయన తెలిపారు రెండు రోజుల వ్యవధిలోనే చోరీ కేసును చేదించిన దుమ్ముగూడెం పోలీసులు సీఐ వెంకటప్పయ్య సిబ్బందిని ఆయన అభినందించారుదొంగతనాల నివారణకు ముఖ్య సూచనలు చేసిన పోలీసులు దొంగతనాల నివారణకు పోలీసులు ప్రజలకు ముఖ్య సూచనలు చేశారు ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు ప్రధాన ద్వారంతోపాటు వెనుక తలుపులు కిటికీలు బాల్కనీ తలుపులకు తప్పనిసరిగా తాళాలు వేయాలి తలుపును కేవలం గడియపెట్టి విడిచిపెట్టకుండా నాణ్యమైన తాళాలు సెంట్రల్ లాకింగ్ వ్యవస్థను ఉపయోగించాలి బంగారు ఆభరణాలు అధిక నగదు విలువైన వస్తువులను ఇళ్లలో ఉంచకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలి ఎక్కువ రోజులు ఊరు వెళ్లాల్సి వస్తే స్థానిక పోలీసులకు విశ్వసనీయమైన పొరుగువారికి సమాచారం ఇవ్వాలి ఇంటికి వచ్చే అపరిచితులు అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు లేదా వాహనాల వివరాలను గమనించి వెంటనే పోలీసులకు తెలియజేయాలి అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే స్వయంగా వారిని ఎదుర్కొనే ప్రయత్నం చేయకుండా వెంటనే డయల్ 100/112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలి తక్కువ ధరకు బంగారు లేదా వెండి ఆభరణాలను విక్రయించేందుకు వచ్చే అపరిచితుల నుంచి ఎలాంటి వస్తువులను కొనుగోలు చేయకూడదు దొంగతనం చేసిన సొత్తని తెలిసి స్వీకరించడం లేదా కొనుగోలు చేయడం కూడా చట్టరీత్యా నేరం ప్రతి గ్రామం కాలనీ అపార్ట్‌మెంట్‌లో ప్రజలు పరస్పర సహకారంతో నిఘా ఏర్పాటు చేసుకొని అనుమానాస్పద కదలికలను పోలీసుల దృష్టికి తీసుకురావాలి ప్రజల సహకారంతోనే దొంగతనాలను సమర్థవంతంగా నివారించగలమని అనుమానాస్పద సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని భద్రాచలం ఎస్‌డీపీఓ తెలిపారు

## కత్తిపోటుతో గొత్తీ కోయ వ్యక్తి మృతి

**ఆళ్లపల్లి12 సెప్టెంబర్ ప్రభాతవార్త:**



కత్తిపోటుతో గొత్తి కోయ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలోని మర్కోడు గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది వివరాల్లకెళ్తే శుక్రవారం రాత్రి సతీష్గడ్ ప్రాంతానికి చెందిన పూనెం నారాయణ పేరుతో పిలవబడే గొత్తికోయ వ్యక్తి గత నాలుగు సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో ఒకరి ఇద్దరు రైతులు వద్ద నివసిస్తూ వారి వ్యవసాయ పనులు చూసుకుంటూ వారితోనే జీవనం కొనసాగిస్తున్నాడు తనకి మంత్రాలు వస్తాయని నేపథ్యంతో అనుమానాలతోనూ కక్షలతోను వివిధ కారణాలతో గుర్తు తెలియని వ్యక్తులు రైతు దగ్గర పనిచేసే వ్యవసాయ భూమి వద్దనే కత్తితో దాడి చేసి దుండగలు పరారయ్యారు శనివారం ఉదయం అటువైపు వెళుతున్న కొందరు వ్యక్తులు మృతి చెందిన వ్యక్తిని గమనించి గ్రామస్తులకు తెలియజేయడంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో డిఎస్పి యు వెంకన్న బాబు, సిఐ సత్యనారాయణ, స్థానిక ఎస్సై సోమేశ్వర్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించి మృతి చెందిన వ్యక్తికి బంధువులు ఎవరు లేకపోవడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు ఈ సంఘటనపై కేసు నమోదు చేసి అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారణ చేపడుతున్నామని వివరాలు తెలియాల్సి ఉందని వారన్నారు.

## ప్రమాదవశాత్తు కాలువలో పడి వ్యక్తి మృతి

**కారేపల్లి సెప్టెంబర్ 12 ప్రభాతవార్త**



ప్రమాదవశాత్తు కాలువలో పడి ఓ వ్యక్తిమృతి చెందిన ఘటన సింగరేణి మండలం పేరుపల్లి గ్రామ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పేరుపల్లి పాత కేసీఆర్ కాలనీకి చెందిన పోలబోయిన వెంకన్న (రాయుడు) గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అయితే శుక్రవారం ఉదయం వరకు ఆయన ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఇదిలా ఉండగా.. శనివారం ఉదయం నాగరాజు కట్టు సమీపంలోని పేరుపల్లి పెద్దచెరువుకు వెళ్లే కాలువలో కొత్తగడ్డ వద్ద ఓ మృతదేహం కనిపించింది. స్థానికులు మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో వారు అక్కడికి చేరుకుని మృతుడు వెంకన్నగా గుర్తించారు. ప్రమాదవశాత్తు కాలువలో పడి వెంకన్న మృతి చెంది ఉండొచ్చని స్థానికులు భావిస్తున్నారు. ఘటనపై పోలీసుల విచారణ చేపట్టారు.

# నేరాలు-దారుణాలు



## పోక్సో కేసు నిందితుడి ఆత్మహత్య

**రూ.20 లక్షలు ఇవ్వాలంటూ ఇద్దరు వ్యక్తుల బెదిరింపులు..**

**సూసైడ్ నోట్ ఆధారంగా పోలీసుల కేసు నమోదు**

**ముదిగొండ ప్రభాతవార్త, సెప్టెంబర్ 12 :**

ముదిగొండ మండల కేంద్రానికి చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. సుమారు ఐదారు నెలల క్రితం ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో పోలీసులు నిందితుడిని పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దాదాపు రెండు నెలల క్రితం బెయిల్‌పై బయటకు వచ్చిన నిందితుడు గత రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు చేసుకున్నాడు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. రూ. 20 లక్షలు ఇవ్వాలంటూ బెదిరింపులు బెయిల్‌పై బయటకు వచ్చిన నిందితుడికి ఇద్దరు వ్యక్తులు రూ. 20 లక్షలు ఇవ్వాలంటూ బెదిరించారని, వారి బెదిరింపుల కారణంగానే తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు నిందితుడు సూసైడ్ నోట్‌లో పేర్కొన్నట్లు సమాచారం. అయితే ఈ వివరాలను పోలీసులు అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. సూసైడ్ నోట్ ఆధారంగా దర్యాప్తు సూసైడ్ నోట్ ఆధారంగా ముదిగొండ పోలీసులు కేసు నమోదు చేసి, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల కోసం గాలిస్తున్నట్లు సమాచారం. ఆత్మహత్యకు గల పూర్తి కారణాలు, బెదిరింపుల వెనుక ఉన్న వాస్తవాలను నిర్ధారించేందుకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

## పింఛన్ల దరఖాస్తులు క్షేత్రస్థాయి పరిశీలన

**పినపాక, ప్రభాతవార్త, సెప్టెంబర్ 12 :**

మండల పరిధిలో గల గ్రామ పంచాయతీలలో తెలంగాణ చేయూత పింఛన్ పథకం కోసం కొత్తగా దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను నేటి నుంచి మండలంలో ఇంటింటికీ వచ్చి ప్రత్యక్షంగా తనిఖీలు చేయడానికి ప్రత్యేక పరిశీలన బృందాలు బయలుదేరుతాయని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంకీర్త్ తెలిపారు.ఈ సందర్భంగా అయన కార్యాలయం నుంచి శనివారం మాట్లాడుతూ కేటాయించబడిన ప్రత్యేక పరిశీలన అధికారులు ఈ తనిఖీలను నిర్వహిస్తారని, క్షేత్రస్థాయి భౌతిక తనిఖీతో పాటు లైవ్ మొబైల్ యాప్‌లో వివరాలను నమోదు చేస్తారని వెల్లడించారు. తనిఖీ సమయంలో లబ్ధిదారులు ఆధార్ కార్డ్ (దరఖాస్తుదారుడు మరియు కుటుంబ సభ్యులది), ఆహార భద్రతా కార్డ్ / వైట్ రేషన్ కార్డ్,వయస్సు ధృవీకరణ పత్రం (ఓటర్ ఐడీ / జనన ధృవీకరణ పత్రం / ట్రాన్స్ ఫర్ సర్టిఫికేట్ బ్యాంక్ పాస్‌బుక్ (ఆధార్ సీడింగ్, యాక్టివ్‌లో ఉన్న ఖాతా),పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. వితంతువులు భర్త మరణ ధృవీకరణ పత్రం, దివ్యాంగులు సదరమ్, సర్టిఫికేట్ (40 లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం), ఒంటరి మహిళలు,ఎమ్ పి డి ఓ జారీ చేసిన ధృవీకరణ పత్రం చేనేత కార్మికులు / కల్లు గీత కార్మికులు: సొసైటీ లేదా సంబంధిత శాఖ జారీ చేసిన సర్టిఫికేట్ దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు (డయాలసిస్ / ఫైలేరియా), మెడికల్ బోర్డ్ సర్టిఫికేట్ కలిగి ఉండలన్నారు. తనిఖీ అధికారులు వచ్చిన సమయంలో లబ్ధిదారులు తమ ఇంట్లోనే తప్పనిసరిగా ఉండాలన్నారు. అప్లికేషన్ ఆమోదంలో ఆలస్యం కాకుండా ఉండటానికి,ఆధార్ వివరాలు దరఖాస్తులో సమర్పించిన వివరాలతో సరిపోలేలా చూసుకోవలన్నారు. అదేవిదంగా పరిశీలన ప్రక్రియ పూర్తిగా ఉచితమని,దళారులకు లేదా అనధికార వ్యక్తులకు ఎలాంటి డబ్బులు చెల్లించవద్దని సూచించారు. లబ్ధిదారులు క్షేత్రస్థాయి పరిశీలనకు సహకరించి, అవసరమైన అసలు పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఎంపీడీవో సంకీర్త్ సూచించారు.

## దుండేటి కేశవరెడ్డికి పలువురు నివాళులు

**తల్లాడ సెప్టెంబర్ 12 ప్రభాతవార్త**

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన దుండేటి కేశవరెడ్డి దశదిన కర్మ సందర్భంగా శనివారం పలువురు నాయకులు కేశవరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య,టీజీ ఐడిసి చైర్మన్ మువ్వ విజయ్ బాబు, పిడమర్తి రవి తుంబురు దయాకర్ రెడ్డి మారెళ్ళ లక్ష్మణరావు గుత్త వెంకటేశ్వరావు గొడుగునూరు లక్ష్మిరెడ్డి రెడ్డెం వీర మోహన్ రెడ్డి దిరిశాల నరసింహారావు పరామర్శించిన వారిలో ఉన్నారు

## ప్రేమపేరుతోమోసంచేసిన యువకుడు అరెస్ట్

**మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 12:**

ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఒక యువతిని గర్భవతిని చేసిన కేసులో మహేశ్వరపు గణేష్ అనే యువకుడిని అరెస్ట్ చేసినట్లు మణుగూరు డీఎస్పీ వి. రవీంద్రారెడ్డి శనివారం తెలిపారు. మణుగూరుకు చెందిన బాధిత యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.




# రాజీతో కేసులకు చెక్.. లోక్ అదాలత్ సక్సెస్

**కక్షిదారులకు సత్వర న్యాయం..**

**రూ.44.34 లక్షల వసూలు**




**భద్రాచలం, సెప్టెంబరు 12(ప్రభాతవార్త):** భద్రాచలంలోని జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్, అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణాల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను ఘనంగా నిర్వహించారు. లోక్ అదాలత్ ద్వారా రాజీకి అవకాశం ఉన్న కేసులను ఇరువక్షాల అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని మండల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ శివనాయక్ తెలిపారు. కేసుల పరిష్కారంతో కక్షి దారులకు సమయం, ఖర్చు ఆదా అవుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అడిషనల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఏ. దుర్గాభవాని మాట్లాడుతూ లోక్ అదాలత్ సఖ్యతతో వివాదాల పరిష్కారానికి చక్కటి వేదికగా నిలుస్తోందన్నారు. భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడాలి శ్రీనివాసన్, ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి మాట్లాడుతూ కక్షి దారులు రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని కోరారు. భద్రాచలం జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టులో 74 జరిమానా కేసులకు రూ. 2.50 లక్షలు, 28 రాజీ కేసులు, 15 చెక్‌బౌన్స్ కేసులు పరిష్కరించారు. 27 బ్యాంకు కేసుల్లో రూ. 41.41 లక్షలు వసూలయ్యాయి. అడిషనల్ కోర్టులో 890 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులకు రూ. 1.95 లక్షలు, 37 పెట్టీ కేసులకు రూ. 6,500 జరిమానా విధించారు. కక్షి దారుల సౌకర్యార్థం రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాచలం, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అల్పాహారం, శ్రీరామ్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు, లోక్ అదాలత్ సభ్యులు, బ్యాంకు అధికారులు, సిబ్బంది, కక్షి దారులు పాల్గొన్నారు.

## వినాయక చవితితో గిరిజన దర్బార్ ప్రజావాణి రద్దు

**భద్రాచలం, సెప్టెంబర్ 12(ప్రభాతవార్త):**



వినాయక చవితి పండుగ సందర్భంగా ఈ నెల 14న సోమవారం భద్రాచలంలో నిర్వహించాల్సిన ఐటీడీఏ గిరిజన దర్బార్, సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రజావాణి కార్యక్రమాలను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే గిరిజన దర్బార్‌ను పండుగ సెలవు కారణంగా రద్దు చేస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. పండుగ సెలవు కారణంగా ఐటీడీఏ యూనిట్ అధికారులు అందుబాటులో ఉండరని, ఈ నేపథ్యంలో గిరిజన దర్బార్ నిర్వహించడం లేదని తెలిపారు. ఆదివాసీ గిరిజనులు దరఖాస్తులు సమర్పించేందుకు ఆ రోజు ఐటీడీఏ కార్యాలయానికి రావద్దని సూచించారు. అదేవిధంగా భద్రాచలం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని కూడా రద్దు చేసినట్లు సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ట తెలిపారు. వినాయక చవితి పండుగ సెలవు నేపథ్యంలో రెవెన్యూ డివిజన్ అధికారులు అందుబాటులో ఉండని కారణంగా ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. డివిజన్ ప్రజలు దరఖాస్తులు సమర్పించేందుకు సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయానికి రావద్దని సూచించారు.

## సాయిబాబా ఆలయంను దర్శించుకున్న అరకు ఎంపీ, మాజీ ఎమ్మెల్యే

**భద్రాచలం కల్చరల్ ప్రభాతవార్త సెప్టెంబర్ 12**

భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న శ్రీశ్రీశ్రీ షిరిడీ సాయిబాబా ఆలయాన్ని అరకు వైఎస్సార్‌సీపీ ఎంపీ గుమ్మ తనుజా రాణి, రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి శనివారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వారిని ఆలయ చైర్మన్ కొమ్మనాపల్లి ఆదినారాయణ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సాయిబాబా సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కొద్దిసేపు గడిపి, ఆలయ విశేషాలను అడిగి తెలుసుకున్నారు. ఆలయ అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు సాయిబాబా ఆలయ విశిష్టత, నిత్యం నిర్వహించే పూజా కార్యక్రమాలు, భక్తుల కోసం చేపడుతున్న ఏర్పాట్లను వివరించారు. ఎంపీ గుమ్మ తనుజా రాణి, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి సాయిబాబా దర్శనానికి రావడంతో ఆలయ పరిసరాల్లో సందడి నెలకొంది. పలువురు భక్తులు వారిని కలిసి అభివాదం చేశారు. దర్శనం అనంతరం వారు సాయిబాబా ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొమ్మనాపల్లి ఆదినారాయణ, కోశాధికారి గొర్ల వెంకటేశ్వరరావు, ఆలయ ప్రధాన అర్చకులు ఆకెళ్ళ శ్రీరామ్ శర్మ ప్రముఖ సమాజ సేవకుడు కదాలి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఉద్యోగం సాధించిన నాగదుర్గకు అభినందనలు

**దుమ్ముగూడెం: ప్రభాతవార్త సెప్టెంబర్ 12**



భద్రాచలం జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు నందు జూనియర్ అసిస్టెంట్ గా నియామకం పొందిన దుమ్ముగూడెం మండలం మారాయిగూడెం గ్రామానికి చెందిన గిరిజన యువతి సోడి నాగదుర్గను దుమ్ముగూడెం మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు శనివారం అభినందించి శాలువాతో సన్మానించారు. భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాలను పొంది ఎంతో ఎత్తుకు ఎదగాలని ఆమెను ఆశీర్వదించారు ఆ పార్టీ మండల కో కన్వీనర్ జానీ పాషా లీగల్ అడ్వైజర్ కొత్త మల్లేశ్వరరావు మాజీ ఉపాధ్యక్షుడు అపకా వీర్రాజు సర్పంచ్ అపకా అశ్వని నాయకులు కణితి లక్ష్మణ్ సాగి ఆంజనేయవర్మ అపకా వెంకటేశ్వరరావు ఉపసర్పంచ్ అపకా గోపాల్ రామారావు మడకం సలీం మడకం వీరభద్రం సోయం చిట్టిబాబు అపకా అనిల్ మడకం కార్తీక్ బాబు అపకా వీరమ్మ సీతమ్మ శాంతమ్మ అచ్చమ్మ కామమ్మ తదితరులు పాల్గొన్నారు

## గణేష్ మండపాల నిర్వాహకులకు పోలీసుల సూచనలు

**దుమ్ముగూడెం: ప్రభాతవార్త (సెప్టెంబర్ 12)**

గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండపాలు నిర్వహించే నిర్వాహకులకు దుమ్ముగూడెం సిఐ వెంకటప్పయ్య శనివారం పలు సూచనలు చేశారు దుమ్ముగూడెం పోలీస్ స్టేషన్ వద్ద గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశమై మండపాల నిర్వహణపై తీసుకోవలసిన జాగ్రత్తలు శాంతి భద్రతలు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు పాటించాలని వారికి తెలిపారు మండపాలు ఏర్పాటు చేసుకున్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు



## స్మార్ట్ కిడ్జ్ లో వేడుకగా గణేష్ చతుర్థి సంబురాలు

**మట్టి గణపతులనే పూజించాలని చైతన్య ర్యాలీ**

**చిట్టి చేతులతో మట్టి గణపయ్యల తయారీ**

**ఖమ్మం సెప్టెంబర్ 12, ప్రభాత వార్త :**



స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శనివారం గణేష్ చతుర్థి సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. పాఠశాల చిన్నారులు తమ చిట్టి చేతులతో మట్టి గణపయ్యలకు రూపం ఇచ్చి మట్టి గణపతిని పూజించాలనే సందేశాన్ని అందించారు. మట్టి గణపయ్యలతో నగరంలో పాఠశాల చిన్నారులు చైతన్య ర్యాలీ నిర్వహించారు. మట్టి గణపతులను పూజించాలని, పర్యావరణాన్ని పరిరక్షించాలని, ఎకో ఫ్రెండ్లీ గణపయ్యలతో పూజించడం ద్వారా కాలుష్యాన్ని దూరం చేయవచ్చు అని తెలియజేస్తూ నిర్వహించిన అవగాహన ర్యాలీ నగర ప్రజలను ఆకట్టుకున్నది. పూలతో, పిండితో, పలురకాల ఆకులతో, పండ్లు, వివిధ రకాల కూరగాయలు, దినుసులతో వినాయక ఆకృతులలో ప్రతిమలను తయారు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ మాతృ వాక్య పరిపాలన కోసం వినాయకుడు నిరంతరం మాతృ ప్రేమను చాటి చెప్పారని తెలిపారు. ఎకో ఫ్రెండ్లీగా మట్టి గణపయ్యలను పూజించాల్సిన అవసరం ఉందన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనిక రంగులతో రూపొందించిన వినాయకులను పూజించడం ద్వారా జల కాలుష్యం, వాయు కాలుష్యం, వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపయ్యల విగ్రహాలను పూజించాలని కోరారు. వాతావరణ కాలుష్యాన్ని నివారించడానికి ఎకో ఫ్రెండ్లీ గణపతిని పూజించాలని విద్యార్థులలో అవగాహన పెంచేందుకు తమ పాఠశాలలో విద్యార్థులతోనే పలు రకాల మట్టి వినాయకులను తయారు చేసే కార్యక్రమంతో అవగాహన కల్పించామని పేర్కొన్నారు. గణేష్ ఉత్సవాలు సామూహికంగా ప్రజలలో చైతన్యాన్ని, సహకార భావనను, మైత్రి బంధాన్ని పెంపొందిస్తున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.






# రాజీ మార్గమే రాజ మార్గం..

# రాజీ పడడానికి అవకాశం ఉన్న అన్ని కేసుల్లో రాజీ పడవచ్చు

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ నాగరాజు**

**జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్ లో 3వ జాతీయ లోక్ అదాలత్‌ను ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి**

**ప్రభాతవార్త గాంధీ చౌక్ సెప్టెంబర్ 12**

రాజీ మార్గమే రాజ మార్గమని, రాజీ పడదగ్గ కేసులలో రాజీ పడి, సత్వర న్యాయం పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. నాగరాజు తెలుపారు. జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థల ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 3వ జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం ఖమ్మం న్యాయ సేవా సదన్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలో 15 లోక్ అదాలత్ బెంచ్‌ల ఏర్పాటు చేసినట్లు, ఇందులో ఖమ్మం హెడ్ క్వార్టర్ లో 9, సత్తుపల్లిలో 3, మధిరలో 3 బెంచ్ లు ఉన్నాయని అన్నారు. ప్రజలకు వేగంగా, సమర్థవంతంగా న్యాయం అందించేందుకు వీటిని ఏర్పాటుచేశామన్నారు. సివిల్ కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, మోటార్ వాహన ప్రమాద పరిహార కేసులు, బ్యాంక్ రికవరీ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ/వైవాహిక వివాదాలు, ప్రీలిటిగేషన్ కేసులు, వినియోగదారుల వివాదాలు, రాజీపడదగ్గ కేసులన్నీ లోక్ అదాలత్ లో పరిష్కారం అవుతాయన్నారు. ప్రాచీన కాలం నుంచే మన సంస్కృతిలో సామరస్య పరిష్కార




వ్యవస్థలు ఉన్నాయని, లోక్ అదాలత్ అనేది వివాదాలను త్వరగా, తక్కువ ఖర్చుతో ముగించే సరళమైన మార్గమని తెలిపారు. కోర్టు ఫీజులు చెల్లించి ఉంటే వాటిని సంబంధిత పక్షాలకు తిరిగి చెల్లిస్తారని, లోక్ అదాలత్ ఇచ్చే తీర్పు సివిల్ కోర్టు డిక్రీతో సమానమైన చట్టబద్ధత కలిగి ఉంటుందని అన్నారు. లోక్ అదాలత్ ద్వారా సమయం, ధనం ఆదా అవుతుందని, కోర్టుల చుట్టూ తిరిగే శ్రమ తగ్గడమే కాకుండా, కక్షలు కార్పణ్యాలు లేకుండా రెండు పక్షాలకూ విన్‌విన్ ఫలితం లభిస్తుందని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. ఇరుపక్షాల అంగీకారంతో తీర్పు వెలువడటం వల్ల మళ్లీ ఉన్నత కోర్టుల్లో అప్పీలు చేసుకునే అవసరం ఉండదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ అన్నారు. గతంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లలో ఖమ్మం జిల్లా న్యాయశాఖ, పోలీసు విభాగం, న్యాయవాదుల సహకారంతో తెలంగాణ రాష్ట్రంలోనే 5వ ర్యాంకు సాధించిందని గుర్తుచేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ వంటి మెట్రోపాలిటన్ ప్రాంతాలతో పోటీపడి ఈ స్థాయిని సాధించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ, సమాజంలో వివాదాలను పరస్పర అవగాహన, ఒప్పందాల ద్వారా పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్ అదాలత్ అత్యంత ప్రాముఖ్యమైన వేదిక అని అన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల బాధితులకు, వివాదంలో ఉన్న ఇరువర్గాలకు సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు చట్టబద్ధమైన శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. చిన్న చిన్న వివాదాలను ఇరుపక్షాలు కూర్చుని మాట్లాడుకోవడం వల్ల న్యాయస్థానాలపై కేసుల భారం తగ్గుతుందని తెలిపారు. పోలీసు శాఖ, బార్ కౌన్సిల్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయధికారులు సమన్వయంతో పనిచేసి లోక్ అదాలత్ ద్వారా గరిష్ట సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని అన్నారు. గత లోక్ అదాలత్‌లో దాదాపు 5,800 కేసులు పరిష్కారం కాగా, ప్రస్తుతం 7,800 కేసులు సిద్ధంగా ఉన్నాయని, ఈ సంఖ్యను 10,000 దాటించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పోలీస్ కమిషనర్ వెల్లడించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ వివాదాలను స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కరించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా లోక్ అదాలత్ లో పరిష్కారం అయిన కేసులకు సంబంధించి చెక్కులను ప్రధాన న్యాయమూర్తి అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కోర్ట్ న్యాయమూర్తి వీ. శీనయ్య, ఎస్సీ, ఎస్టీ కోర్ట్ న్యాయమూర్తి పి.పి. కృష్ణార్జున్, కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి మహేష్ నాథ్, బార్ కౌన్సిల్ సభ్యులు ఎం. శ్రీనివాస రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు యడ్లపల్లి రమేష్, జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి దేవీ మానస, న్యాయమూర్తులు కల్పన, శివరంజని, మురళీమోహన్, జ్యోతిర్మయి, రజని, బిందుప్రియ, ప్రవీణ్, నాగలక్ష్మి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ప్యానెల్ అడ్వకేట్లు, వివిధ శాఖల అధికారులు, బ్యాంకింగ్/ఇన్సూరెన్స్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## నిన్ను నువ్వు మార్చుకుంటే ప్రపంచాన్నే మార్చగలవు

**సర్వజ్ఞ ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆకెళ్ల రాఘవేంద్ర**

**ఖమ్మం విద్యా విభాగం సెప్టెంబర్ 12, ప్రభాత వార్త :**



ఖమ్మంలోని సర్వజ్ఞ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నూతనంగా చేరిన జూనియర్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన "తరంగ్-2026" ఫ్రెషర్స్ పార్టీ వేడుకలు స్థానిక భ్రమరాంబ గ్రాండ్ ఏ/సీ కన్వెన్షన్ హాల్లో శనివారం అత్యంత ఉత్సాహభరితంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులను కేవలం పరీక్షలకు సిద్ధం చేయడం మాత్రమే కాకుండా, సమాజంలో ఉన్నతమైన వ్యక్తులుగా తీర్చిదిద్దడమేనని తెలిపారు. కళాశాల డైరెక్టర్ కె. నీలిమ మాట్లాడుతూ, అనుభవజ్ఞులైన అధ్యాపకుల పర్యవేక్షణలో ఐ ఐ టి , జె ఇ ఇ, నీట్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళికాబద్ధమైన శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ ఆకెళ్ల రాఘవేంద్ర మాట్లాడుతూ, "ఇది నీ లైఫ్... నీకు నచ్చినట్లు బ్రతుకు. నీలో హీరోని నిద్రలేపు. నిన్ను తిట్టినోడే తిరిగి గౌరవించేలా చేయి. ఇతరులతో పోల్చుకునే వాడు ఎప్పటికీ హ్యాపీగా ఉండలేడు!" అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి, ఎఫ్ బి ఇ యం ఎ కన్వీనర్ మువ్వా శ్రీనివాసరావు డీన్ జనార్ధన్, ప్రిన్సిపాల్ లక్ష్మణరావు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా చిమ్మపూడి గ్రామ వాసి చింతల.రమేష్ ఏకగ్రీవంగా ఎన్నిక

**యాదగిరిగుట్టలో ఘనంగా ఉత్సాహపూరితంగా విజయవంతంగా ముగిసిన ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలు**

**ఏఐవైఎఫ్ మహాసభలలో ఆమోదించిన తీర్మానాల అమలుకు యువజన ఉద్యమాలను బలోపేతం చేస్తాం**

**రఘునాథపాలెం, ప్రభాత వార్త సెప్టెంబర్ 12:**



అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్)రాష్ట్ర స్థాయిలో రఘునాథపాలెం మండల వాసి చిమ్మపూడి గ్రామానికి చెందిన ఖమ్మం జిల్లా కార్యదర్శి చింతల.రమేష్ కి కీలక బాధ్యతలు అప్పగించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా జిల్లా కార్యదర్శి చింతల రమేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని ఏఐవైఎఫ్ నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు మగ్రి.శ్రీమాన్,నేర్లకంటి. శ్రీకాంత్ లు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో సెప్టెంబర్ 8, 9,10 తేదీలలో జరిగిన ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలలో వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికైన చింతల.రమేష్ మాట్లాడుతూ ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలలో విద్యార్థుల, నిరుద్యోగుల,మహిళల, ప్రజా సమస్యలపై పాలు తీర్మానాలు ఆమోదం చేసుకొని భవిష్యత్ పోరాటాలకు, ఉద్యమాలకు రూపకల్పన చేశామని, ప్రధానంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బయ్యారం ఉక్కు పరిశ్రమ నిర్మాణం చేపట్టాలని, ఖమ్మంలో ప్రభుత్వమే గ్రానైట్, వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించి పరిశ్రమలను స్థాపించి స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించాలని అనేక తీర్మానాలు చేశామని వారు తెలిపారు. యాదగిరిగుట్టలో ఏఐవైఎఫ్ 3వ రాష్ట్ర మహాసభలు యువజన మహా ప్రదర్శన బహిరంగ సభ ఉత్సాహపూరితంగా విజయవంతంగా జరిగాయని, ఆ స్ఫూర్తితో ఈ తీర్మానాల అమలుకు భవిష్యత్ లో రాష్ట్ర వ్యాప్తంగా యువజన ఉద్యమాలను బలోపేతం చేస్తాం అన్ని వారు వెల్లడించారు.

## మట్టి వినాయకుని పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడదాం

**గీతాంజలి విద్యార్థుల ప్రదర్శన**

**ఖమ్మం విద్యా విభాగం సెప్టెంబర్ 12, ప్రభాత వార్త:**




ఖమ్మం పట్టణంలోని శ్రీనివాస్ నగర్ లోని గీతాంజలి పాఠశాల విద్యార్థులు మట్టి వినాయకుని పూజిద్దాం, పర్యావరణాన్ని కాపాడదాం అని నినదిస్తూ ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు మట్టి గణనాధులతో ప్రదర్శన నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ టి.వి. అప్పారావు మాట్లాడుతూ వినాయక చవితి పర్వదినం మట్టితో తయారు చేసిన గణనాథుని పూజించాలని తద్వారా పర్యావరణాన్ని కాపాడాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ తో తయారు చేసిన విగ్రహాలను వాడడం వలన పర్యావరణానికి విఘాతం కలుగుతుందని తెలిపారు. పాఠశాల డైరెక్టర్స్ టి పద్మ, టి అరుణ్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో సృజనాత్మకత అవసరం

**వికాస్ స్కూల్ కరస్పాండెంట్ లావణ్య వికాస్ స్కూల్‌లో ఘనంగా పిండి గణపతి తయారీ కార్యక్రమం**

**ఖమ్మం విద్యా విభాగం సెప్టెంబర్ 12 ప్రభాత వార్త :**



వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వికాస్ స్కూల్‌లో విద్యార్థులకు ప్రత్యేకమైన సృజనాత్మక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పిండితో అందమైన గణపతి ప్రతిమలను స్వయంగా తయారు చేశారు. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో గణపతి ప్రతిమలను తయారు చేస్తూ విద్యార్థులు తమ సృజనాత్మకతను చాటుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా పిల్లలకు పండుగల ప్రాముఖ్యతతో పాటు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ చేతులతో తయారు చేసిన గణపతి ప్రతిమలను ఇళ్లకు తీసుకెళ్లి, కుటుంబ సభ్యులతో కలిసి వినాయక చవితి పండుగను ఆనందంగా జరుపుకోనున్నారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో సృజనాత్మకత, సంప్రదాయాల పట్ల గౌరవం పర్యావరణ స్పృహను పెంపొందించేందుకు ఎంతో ఉపయోగపడిందని వికాస్ స్కూల్ కరస్పాండెంట్ లావణ్య తెలిపారు.






## బొగ్గు కోసం.. ఓబీపై ఫోకస్ !

**రోజువారీ 12.1 లక్షల క్యూబిక్ మీటర్ల తొలగింపునకు టార్గెట్**

కొత్తగూడెం, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త: విద్యుత్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరా కొనసాగించేందుకు సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనుల్లో ఓవర్ బర్డెన్ (ఓబీ) తొలగింపును వేగవంతం చేస్తోంది. బొగ్గు వెలికితీతకు మార్గం సుగమం చేసేలా సెప్టెంబర్‌లో ఓబీ తొలగింపు లక్ష్యాన్ని రోజుకు 12.1 లక్షల క్యూబిక్ మీటర్లకు పెంచింది. సింగరేణి పరిధిలోని 15 ఓపెన్‌కాస్ట్ గనుల్లో 19 సంస్థలు ఓబీ తొలగింపు పనులు




చేపడుతున్నాయి. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 1,205 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యానికి 1,221 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగించడం ద్వారా 101 శాతం పనితీరు నమోదైంది. అయితే మొత్తం సంస్థల్లో ఎనిమిది మాత్రమే నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేయగా.. మిగిలిన సంస్థలు వెనుకబడటంపై యాజమాన్యం దృష్టి సారించింది. ముఖ్యంగా జేవీఆర్ ఓసీ, మణుగూరు ఓసీ, జీడీకే ఓసీ, ఆర్జీ ఓసీ2, ఆర్జీ ఓసీ3, కేటీకే ఓసీ2, శ్రీరాంపూర్ ఓసీల్లో పనుల వేగాన్ని పెంచాలని ఆదేశించింది. లక్ష్యాలకు అనుగుణంగా షవల్స్, డంపర్ల వంటి భారీ యంత్రాల ను అందుబాటు లో ఉంచడంతో పాటు వాటి వినియోగ సామర్థ్యాన్ని పెంచా లని సూచించింది. ఇక కొత్త ఓపెన్‌కాస్ట్ గనుల్లో ఓబీ తొలగింపు పనులకు సంబంధి ంచిన టెండర్లను త్వరగా పూర్తి చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని యాజమాన్యం నిర్ణయించింది. బొగ్గు డిమాండ్ పెరుగుతున్న తరుణంలో ఓబీ తొలగింపులో జాప్యం జరగకుండా సింగరేణి యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టింది.

## జిఎం కార్యాలయంలో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

రుద్రంపూర్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:



కొత్తగూడెం ఏరియా లోని జనరల్ మేనేజర్ కార్యాలయములో మట్టి వినాయక విగ్రహ ప్రతిమల పంపిణీ కార్యక్రమమును నిర్వహించడం జరిగినది. ముఖ్య అతిధిగా కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ సిహెచ్ వెంకటరమణ పాల్గొని ఈ మట్టి వినాయక విగ్రహ ప్రతిమల పంపిణీ చేసారు. ఉద్యోగులందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలుపుతూ పర్యావరణము పరిరక్షి ంచుకోవడం మన అందరి ప్రాథమిక బాధ్యత అని అందులో భాగంగా ఈ మట్టి ప్రతిమలను ఉద్యోగులకు అందజేయడం జరుగుతుందని కావున ఉద్యోగులందరూ ఈ విషయాన్ని గమనించి మట్టి వినాయక విగ్రహ ప్రతిమలకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించుకొని వినాయక చవితి పండుగను జరుపుకోవాలని తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం జిఎంతో పాటు ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ జే. గట్టయ్య, ఐఎన్‌టియుసి యూనియన్ వైస్ ప్రెసిడెంట్ ఎండి.రజాక్, ఎస్ ఓ టు జిఎం ఎం. గోవింద రావు , ఇతర విభాగాల అధిపతులు, అధికారులు జిఎం కార్యాలయంలో పనిచేయు ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## అన్ని యూనియన్ సమానంగా చూడాలి

**జీఎం ను కలిసిన టిబిజికెఎస్ నాయకులూ**

రుద్రంపూర్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త: సింగరేణి సంస్థలో (ఎస్సీసీఎల్) కార్మిక సంఘాల ఎన్నికలు రెండేళ్ల కాలపరిమితి పూర్తయినందున కొత్త కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించాలని, ఎన్నికలు జరిగే వరకు అన్ని యూనియన్లకు సమాన ప్రాతిపదికన హోదా కల్పించాలని టి.బి.జి.కె.ఎస్ నాయకులూ విజ్ఞప్తి చేసారు. శనివారం ఏరియా జీఎం వెంకటరమణ ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. సింగరేణిలో కార్మిక సంఘాల ఎన్నికలు సీక్రెట్ బ్యాలెట్ ద్వారా 27.12.2023న నిర్వహించబడ్డాయని, అదే రోజున డిప్యూటీ సి.ఎల్.సి (హైదరాబాద్) వారి కార్యాలయం ద్వారా ఎన్నికల ఫలితాలు, గుర్తింపు పొందిన యూనియన్ హోదాను ప్రకటించారన్నారు. అయితే ఫలితాలు 27.12.2023న ప్రకటించినప్పటికీ, యూనియన్ల అంతర్గత అంశాల కారణంగా ఎన్నికైన యూనియన్లకు గుర్తింపు/ప్రాతినిధ్య హోదా పత్రాలు 09.09.2024న అందాయని, అంతేకాకుండా, గుర్తింపు హోదా పత్రం అందుకున్న తేదీ నుండి గణించినా కూడా రెండు సంవత్సరాల కాలపరిమితి ఈనెల 8తో పూర్తయిందని చెప్పారు. ఎన్నికలకు నిర్వహణకు సంబంధించి టి.బి.జి.కె.ఎస్ పక్షాన హైకోర్టులో వేసిన పిటీషన్ నేడు బెంచ్ పైకి విచారణకు రాగా దానిని 22 తారీకుకి వాయిదా వేయడం జరిగిందని చెప్పారు. టీబీజీకేస్ రాష్ట్ర చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ, నాయకులు ఏరియా వైస్ ప్రెసిడెంట్ గడప రాజయ్య ఇన్చార్జి జీకే సంపత్ కుమార్, ఫిట్ సెక్రటరీ దివ్య, తిరుపతి, నమిల్ల వెంకటేశ్వర్లు, రాజకుమార్, అన్వర్, రాములు, శ్రావణ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు



## గణేష్ నవరాత్రి ఉత్సవ వేడుకలకు అనుమతులు తీసుకోవాలి

**పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ జీనత్ కుమార్**

జూలూరుపాడు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 12:



వినాయక చవితి పర్వదినం సందర్భంగా గ్రామాల్లో నిర్వహించే గణేష్ నవరాత్రి ఉత్సవ వేడుకలకు అనుమతులు తీసుకోవాలని పోలీసు సబ్ ఇన్స్పెక్టర్ జీనత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గణేష్ మండపాల నిర్వాహకులు మండపాలకు సంబంధించిన పూర్తి వివరాలను తెలంగాణ పోలీస్ శాఖకు చెందిన ఆన్లైన్ పోర్టల్ లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, సంబంధిత మండపం వివరాలు, సంప్రదింపు నంబర్, ఊరేగింపు, నిమజ్జనం వంటి వివరాలు తదితర సమాచారాన్ని ఆన్లైన్ పోర్టల్ లో సక్రమంగా నమోదు చేయాలని తెలిపారు. ఈ నమోదు ప్రక్రియ ద్వారా గణేష్ ఉత్సవాలు, నిమజ్జనం సందర్భంగా పోలీస్ శాఖ అవసరమైన బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ మరియు భద్రతా ఏర్పాట్లు సమర్థవంతంగా చేపట్టేందుకు వీలవుతుందని తెలిపారు. కావున మండల పరిధిలోని ప్రతి గణేష్ మండప నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్లైన్ పోర్టల్ లో తమ వివరాలను నమోదు చేసుకొని పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్సై కోరారు.

## ముగిసిన ఫస్ట్ ఎయిడ్, ఫైర్ ఫైటింగ్ శిక్షణా తరగతులు

కొత్తగూడెం టౌన్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త: సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాలనుండి వచ్చిన 26 మంది సెక్యూరిటీ సిబ్బందికి వారం రోజులపాటు జరిగిన 43వ బ్యాచ్ ఫస్ట్ ఎయిడ్ !! ఫైర్ ఫైటింగ్ శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమానికి ఏరియా సెక్యూరిటీ అధికారి/ ట్రైనింగ్ అధికారి యం. డి జాకీర్ హుస్సేన్ ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి యూనిఫాం సిబ్బందికి ఫస్ట్ ఎయిడ్, ఫైర్ ఫైటింగ్‌పై పూర్తి స్థాయి అవగాహన అవసరమని, అందులో భాగంగా యస్!!పి.సి. విభాగములో ప్రతి సెక్యూరిటీ సిబ్బందికి ఫస్ట్ ఎయిడ్, ఫైర్ ఫైటింగ్‌పై శిక్షణనివ్వడం జరుగుతుందని, తద్వారా సెక్యూరిటీ సిబ్బంది పనితీరు గణనీయంగా మెరుగు పడిందని, వారం రోజుల శిక్షణా కాలంలో ఫస్ట్ ఎయిడ్, ఫైర్ ఫైటింగ్‌లోని అన్ని అంశాలపై బోధించడం జరిగినదని, అందుకోసం మెయిన్ హాస్పిటల్, మైన్స్ రెస్క్యూ స్టేషన్, భద్రాద్రి కొత్తగూడెం ఫైర్ స్టేషన్ నుండి ఫ్యాకల్టీని తీసుకోవడం జరిగినదని అన్నారు. మనకు ఫస్ట్ ఎయిడ్ పై అవగాహన ఉంటే మన తోటి వారు ఆపదలో ఉన్నప్పుడు డాక్టర్ వద్దకు తీసుకు వెళ్ళే లోపు వారి ప్రాణాలను కాపాడవచ్చునని, మనం పని చేయు ప్రదేశాలలో అగ్ని ప్రమాదం సంభవించినపుడు వాటిని నివారించి సింగరేణి ఆస్తులను పరిరక్షి ంచగలమని, మెరుగైన వృత్తి నైపుణ్యంతో, క్రమశిక్షణతో, నీతినిజాయితీతో, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ సమాజాభివృద్ధికై సెక్యూరిటీ సిబ్బంది అందరూ పాటుపడాలని తెలిపారు. శ్రీ జ్యోతి అనాథ వృద్ధుల శరణాలయ నిర్వాహకులకు సెక్యూరిటీ సిబ్బందిచే నిత్యావసర సరుకులను వితరణ చేసారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన వేణుగోపాల్, రాజ్ కుమార్ లకు బహుమతి ప్రదానం చేసారు. ట్రైనింగ్ ఇన్స్పెక్టర్ డి. నారాయణ రెడ్డి, జూనియర్ ఇన్స్పెక్టర్ కె.రాజనర్సు, ట్రైనింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



## మట్టి ప్రతిమలనే పూజిద్దాం

**సింగరేణి ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ...**

కొత్తగూడెం, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం సింగరేణి కార్పొరేట్ ఎన్విరాన్మెంట్, ఫారెస్ట్రీ విభాగం జనరల్ మేనేజర్ బి.సైదులు ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా సింగరేణి ప్రధాన కార్యాలయం, ప్రాజెక్ట్ ప్లానింగ్ బిల్డింగ్ లో జనరల్ మేనేజర్(పి!!పి) జి.దేవేందర్ చేతుల మీదుగా దాదాపు 1000 మట్టి వినాయక ప్రతిమలను, పవిత్రమైన మారేడు మొక్కలను ఉచితముగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా



జనరల్ మేనేజర్(పి!!పి) జి.దేవేందర్ మాట్లాడుతూ... ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితం కాకుండా ఉండేందుకు, పర్యావరణాన్ని సురక్షి తంగా ఉంచడానికి సహజసిద్ధమైన మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే పూజించాలని పేర్కొన్నారు. జనరల్ మేనేజర్ (ఎన్విరాన్మెంట్ !! ఫారెస్ట్రీ) సైదులు మాట్లాడుతూ... సింగరేణి సంస్థ పర్యావరణ పరిరక్షణ లో ముందు వరుస లో ఉంటుంది అని దీనిలో భాగముగా ప్రతీ ఏడాది వినాయక ప్రతిమలను ఉచితముగా పంపిణీ చేస్తుంది అని, ఈ ఏడాది పచ్చదనం పెంపొందించడం, జీవవైవిధ్యాన్ని పరిరక్షి ంచడం, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించడంలో భాగముగా వినాయక ప్రతిమ తో పాటు పవిత్రమైన మారేడు మొక్కలను కూడా పంపిణీ చేస్తుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్(పి!!పి) జి.దేవేందర్, జిఎం (ఎన్విరాన్మెంట్ !! ఫారెస్ట్రీ) బి.సైదులు, జిఎం(ఎక్స్ప్లోరేషన్) పంకజ్ కుల్ శ్రేష్ఠ జిఎం(సర్వే) ఎన్.రాఘవేంద్ర రావు, జిఎం(ఎస్టేట్స్) జి.ఎస్.గోపాల రాజు, జిఎం(ఐ!!పిఎం) ఎం.వి.నరసింహా రావు, ఎన్విరాన్మెంట్ !! ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అధికారులు, సిబ్బంది, సింగరేణి ఉద్యోగులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించొద్దు

## భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం సాగిన మహత్తర పోరాటం

బోనకల్, ప్రభాతవార్త :

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించకుండా భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా గోవిందాపురం(ఎల్)లోని పోరాట యోధుల స్థూపాల వద్ద సీపీఐ నాయకులు నివాళులర్పించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు తమ్మారపు గోవిందు, తమ్మారపు భద్రయ్య స్థూపాలకు సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆనాటి పోరాటంలో ఒకే చితిపై ప్రాణాలు కోల్పోయిన ఏడుగురు అమరుల స్థూపానికి బాగం హేమంతరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాగం హేమంతరావు మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం



సాగిందన్నారు. వేలాది మంది కమ్యూనిస్టులు ప్రాణత్యాగాలు చేసి, ప్రజలను సమీకరించి సాగించిన పోరాటం ఫలితంగానే తెలంగాణ సంస్థానం భారతదేశంలో విలీనం కావడానికి మార్గం సుగమమైందన్నారు. ఈ చారిత్రక పోరాటాన్ని హిందూ–ముస్లిం పోరాటంగా చిత్రీకరించడం సరికాదని అన్నారు. ఆనాటి పోరాటంలో కుల, మతాలకు అతీతంగా ప్రజలు పాల్గొన్నారని, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజాస్వామిక హక్కులు, భూమి కోసం పోరాడారని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చి అధికారికంగా నిర్వహించాలని సీపీఐ డిమాండ్ చేస్తోందన్నారు. పాలకులు మారుతున్నప్పటికీ సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహిస్తామని గత ప్రభుత్వాలు, ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ఆనాటి పోరాట యోధుల కుటుంబాలకు సముచిత గుర్తింపు కల్పించాలని కోరారు. గోవిందాపురం(ఎల్) తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన చారిత్రక గ్రామమని హేమంతరావు పేర్కొన్నారు. మల్లెల వెంకటేశ్వరరావు నాయకత్వంలో తమ్మారపు గోవిందు, తమ్మారపు భద్రయ్యతో పాటు అనేక మంది ఈ ప్రాంతంలో పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. సాయుధ పోరాటంలో గ్రామ ప్రజల భాగస్వామ్యాన్ని అణచివేయాలనే ఉద్దేశంతో ఏడుగురిని ఒకే చితిపై దహనం చేసిన ఘటన ఈ ప్రాంత పోరాట చరిత్రలో విషాదకర ఘట్టమన్నారు. అమరుల స్ఫూర్తితో భవిష్యత్ ప్రజా ఉద్యమాలను నిర్మించి కమ్యూనిస్టు ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్‌కుమార్, తెలంగాణ రాష్ట్ర కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జక్కుల రామారావు, మాజీ ఎంపీటీసీ జొన్నలగడ్డ సునీత, సీపీఎం గ్రామ కార్యదర్శి తమ్మారపు లక్ష్మణ్, గోవిందాపురం(ఎల్) సర్పంచ్ మంద కరుణ, ఉపసర్పంచ్ కారంగుల చంద్రయ్య, పుచ్చకాయల తిరవతయ్య, తమ్మారపు మల్లయ్య, తమ్మారపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వినాయక చవితి వేడుకలు

బోనకల్, ప్రభాతవార్త :

స్థానిక షైన్ హై స్కూల్లో వినాయక చవితి వేడుకలు చాలా ఘనంగా నిర్వహించారు. చిన్నారులు సాంప్రదాయ వస్త్రధారణలో అందర్నీ అలరించారు. విద్యార్థులు రకరకాల గణపతులను తయారు చేశారు. విద్యార్థులు మట్టితోనూ కూరగాయలతోనూ ఆకుకూరలతోనూ, ఆకులతోనూ పళ్ళతోనూ రకరకాల వినాయకులను తయారుచేసి అందరిని ఆశ్చర్యపరిచారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ షేక్ అన్సర్ పాషా మాట్లాడుతూ వినాయక చవితి అనేది హిందువులకి ముఖ్యమైన పండగ అని, అన్ని విఘ్నాలు తొలగించడానికి ప్రథమంగా పూజలు నిర్వహించేది విఘ్నేశ్వరుడికి అని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ షేక్ లాల్ మహమ్మద్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించే విధంగా అందరూ మట్టి విగ్రహాలని తయారు చేయాలని అన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ ఐటిపాముల శ్వేత మాట్లాడుతూ పిల్లలు అంటే వినాయకుడికి ఎంతో ప్రీతికరమని, వాళ్ల చేతులతో వినాయకుడిని తయారు చేయడం ఎంత సంతోషంగా ఉందని, తమ



విద్యార్థులందరూ ఎంతో ఉత్సాహంగా వినాయకుడి విగ్రహాలను తయారు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ షేక్ అన్సర్ పాషా, డైరెక్టర్ షేక్ లాల్ మహమ్మద్, ప్రిన్సిపల్ అయిటి పాముల శ్వేత, అడ్మినిస్ట్రేటర్ డేగల వేలాద్రి ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్యం ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా కృషి చేయాలి

## జూనియర్, డిగ్రీ కాలేజీ భవనాల ఏటీసీ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

## మధిరలో పర్యటించిన కలెక్టర్

మధిర, సెప్టెంబరు 12 ప్రభాతవార్త

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి ఒక్కరికి పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందేలా వైద్యులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ ఆదేశించారు. శనివారం మధిర మండలంలో పర్య టిం చారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి చేరుకు న్న ఆయన ఆసుపత్రిలో ఇన్ వార్డులో చికిత్స పొందుతున్న వారి వద్దకు వెళ్లి వైద్య సేవలు ఎలా అందుతున్నాయి అన్న విషయమై అడిగి తెలుసు కున్నారు. అందుబాటులో ఉన్న వైద్యులతో వైద్య సేవలు మందులు ఇతర అత్యవసర సేవల విషయమై వివరాలు అడిగి తెలుసుకున్న ఆయన మాట్లాడుతూ, ప్రతి రోగికి నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందేలా అధికారులు, వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని



జిల్లా కలెక్టర్ అన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులపై పూర్తి విశ్వాసంతో సేవలు పొందేలా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. వాతావరణం పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధులు, దోమల ద్వారా వ్యాపించే జ్వరాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అంతకు ముందు మధిర మండలం కేంద్రంలో నూతనంగా మూడు కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కాలేజ్, నాలుగు కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ అదనపు భవనం నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆనతరం మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనం నిర్మాణ పనులు, అలాగే ఐటిఐ భవనం, ఏఐటీసీ సెంటర్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. గుర్తించిన ప్రాధాన్యత పనులు త్వరితగతిన నాణ్యత తో పూర్తి చేయాలని, సమస్యలుంటే పై అధికారుల దృష్టికి తేవాలని, జిల్లా యంత్రాంగం పనుల పూర్తిలో పూర్తి సహకారం అందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట మధిర తహసీల్దారు రాళ్ల బండిరాంబాబు, విద్యశాఖ ఇంజనీరింగ్ అధికారి బుగ్గయ్య, సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

**లచ్చగూడెంలో నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు కలెక్టర్ పరిశీలన .**

**చింతకానీ ప్రభాత వార్త** మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామంలో నూతనంగా మంజూరైన నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ టి ఎస్ దివాకర్ శనివారం పరిశీలించారు నర్సింగ్ కళాశాల తరగతుల నిర్వహణ కోసం గ్రామంలోని మినీ స్టేడియంలో ఉన్న తరగతి గదులను పరిశీలించారు అవసరమైన మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు




# డీజేలకు అనుమతులు ఇవ్వొద్దు

## టౌన్ సీఐ కి డీవైఎఫ్ఐ వినతి

మధిర, సెప్టెంబర్ 12. ప్రభాతవార్త



వినాయక చవితి సందర్భంగా డీజే కార్యక్రమాలకు అనుమతులు ఇవ్వకుండా, అధిక శబ్ద కాలుష్యాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు మధు పట్టణ సీఐ దోమల రమేష్ కు వినతిపత్రం అందజేశారు. డీజే ల తో వచ్చే శ్రద్ధ కాలుష్యం వల న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా యువతపై డీజే సంస్కృతి ప్రతికూల ప్రభావం చూపుతోందని, కొందరు యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అధిక శబ్ద కాలుష్యం వల్ల మానసిక ఒత్తిడి, నిద్రలేమి, రక్తపోటు వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు, వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్యంతో ఉన్నవారిపై అధిక శబ్దం మరింత ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ప్రజల ఆరోగ్యం, శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని డీజే కార్యక్రమాలపై నియంత్రణ విధించాలని, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించే కార్యక్రమాలకు అనుమతులు ఇవ్వకూడదని కోరారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఐకి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వడ్రనపు మధు డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు సైదులు టౌన్ నాయకులు గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు...

## అవాంఛనీయ సంఘటనలు జరిగితే ఉపేక్షించేది లేదు..

. దేవుడు పేరుతో రాజకీయాలు చేస్తే సహించము.

...వినాయకుడి విగ్రహలు దగ్గర సీసీలు ఏర్పాటు చేయాలి.

...ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు జరుపుకోవాలి..

.ఉత్సాహ కమిటీ సమావేశంలో సీఐ వెంకట ప్రసాద్...

చింతకాని ప్రభాత వార్త సెప్టెంబర్ 12



గణేష్ ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటన చూసుకోవాలని అటువంటి ఘటనలు జరిగితే ఉపేక్షించేది లేదని అట్టి బాధ్యత గణేష్ ఉత్సవాల నిర్వహణలు చేసే నిర్వాహకులదేనాని దాని దృష్టిలో ఉంచుకొని పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని వైరా సీఐ వెంకటప్రసాద్ సూచించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్దలతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు గణేష్ ఉత్సవకమిటీలు, మండప నిర్వాహకులు, డీజే సౌండ్ సిస్టం యజమానులతో చింతకాని పోలీస్ స్టేషన్లో ఎస్సై నరేష్ తో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మండపాల వద్ద భద్రతా ప్రమాణాలు పాటించడం, సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం, విద్యుత్ భద్రతా చర్యలు తీసుకోవడం, అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన జాగ్రత్తలు చేపట్టాలని తెలిపారు. మండపాల వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా డీజేలకు ఎలాంటి అనుమతి లేదన్నారు. లౌడ్ స్పీకర్ల వినియోగంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా అధిక శబ్దం చేయరాదని స్పష్టం చేశారు. శోభయాత్ర, నిమజ్జనం సమయంలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పోలీసుల సూచనలు, మార్గదర్శకాలను పాటించాలని తెలిపారు. పోలీసులతో సమన్వయం చేసుకుంటూ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై జి. నరేష్, ఏఎస్సైలు లక్ష్మణ్ చౌదరి, సువర్ణబాబు, సిబ్బంది, గణేష్ మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

# హైవేపై కబ్జా రాజ్యం



**హైవే ఆక్రమణలకు అడ్డూ అదుపూ లేదా?...**

**త్రీ లైన్ హైవే కాస్తా సింగిల్ లైన్ రోడ్డుగా మారిన దుస్థితి..**

**రోడ్డుకు ఇరువైపులా బడ్డీ కొట్లు, కూరగాయల దుకాణాలు..**

**రద్దీ వేళ వాహనదారుల అవస్థలు..**

**ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు..**

**ఒక్కో షాపుకు రూ.10 వేలకుపైగా అద్దె వసూలు .?**

కొత్తగూడెం సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:

కొత్తగూడెం పట్టణంలో నేషనల్ హైవే-30 ఆక్రమణలతో కుచించుకుపోతోంది. పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ నుంచి ఖమ్మం వైపు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా బడ్డీ కొట్లు, కూరగాయల దుకాణాలు, తాత్కాలిక షాపులు వెలుస్తుండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. విశాలంగా ఉండాల్సిన త్రీ లైన్ హైవే.. ఆక్రమణల కారణంగా అనేక చోట్ల సింగిల్ లైన్ రోడ్డును తలపిస్తోంది. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో పరిస్థితి రోజురోజుకూ ఇబ్బందికరంగా మారుతోంది. రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేయడమే కాకుండా, వాటి ముందు కూరగాయల బుట్టలు, బల్లలు, ఇతర సామగ్రిని రహదారి లో సగం వరకు పెట్టడంతో వాహనాలు వెళ్లేందుకు స్థలం తగ్గిపోతోంది. దీంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పించుకోవడం కూడా కష్టంగా మారుతోంది.



### హైవేనా.. మార్కెట్టా?

హైవే పక్కన వ్యాపారాలు నిర్వహించడంలో తప్పు లేకపోయినా.. రహదారి పరిధిలోకి వచ్చి దుకాణాలు ఏర్పాటు చేయడం, కొనుగోలుదారులు వారి వాహనాలు రోడ్డుపైనే నిలబడటం, వాహనాలను ఇష్టారీతిన నిలిపివేయడం సమస్యగా మారింది. దీంతో ప్రధాన రహదారి క్రమంగా మార్కెట్ రూపాన్ని సంతరించుకుంటోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం రద్దీ సమయాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. ఒకవైపు హైవేపై వేగంగా వెళ్లే వాహనాలు.. మరోవైపు రోడ్డుపక్కన దుకాణాలు, కొనుగోలుదారుల రద్దీతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళన నెలకొంటోంది. హైవేపై ఆక్రమణలు కేవలం ట్రాఫిక్ సమస్యకే పరిమితం కావడం లేదు. ప్రమాదాలకు కూడా కారణమవుతున్నాయని వాహనదారులు చెబుతున్నారు. దుకాణాల వద్ద అకస్మాత్తుగా వాహనాలు ఆగడం, రోడ్డుపైనే కొనుగోలుదారులు తిరగడం, ద్విచక్ర వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలపడం వంటి కారణాలతో తరచూ ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇప్పటికే పలుమార్లు ప్రమాదాలు జరిగినా సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ప్రమాదం జరిగిన తర్వాత హడావుడి చేయడం కంటే ముందుగానే ఆక్రమణలను తొలగించి రహదారిని సురక్షితంగా మార్చాలని వాహనదారులు కోరుతున్నారు.

### షాపులు ఎవరివి.. అద్దె ఎవరికీ?

హైవే స్థలాన్ని ఆక్రమించి ఏర్పాటు చేసిన ఒక్కో షాపుకు నెలకు రూ.10 వేలకుపైగా అద్దె వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఇప్పుడు చర్చనీ యాంశంగా మారాయి. ప్రభు త్వ రహదారి పరిధిలో దుకా ణాలు ఏర్పాటు చేసి అద్దెలు వసూలు చేసే అధికారం ఎవరికుంది? ఈ షాపులకు అనుమతులు ఎవరు ఇచ్చా రు? అద్దె రూపంలో వసూలవుతున్న డబ్బులు ఎవరి చేతికి వెళ్తున్నాయి? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపితే అసలు విషయం బయటపడే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రధాన రహదారిపై ఆక్రమణలు బహిరంగంగానే కనిపిస్తున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకవైపు ట్రాఫిక్ పెరుగుతుంటే.. మరోవైపు రహదారి విస్తీర్ణం తగ్గిపోతోంది. అయినా ఆక్రమణలను తొలగిం చడంలో అధికారులు ఎందుకు వెనుకడుగు వేస్తున్నారో అర్థం కావడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. హైవే పరిధి ని అధికారులు ఒకసారి పూర్తిగా సర్వే చేసి, రహదారి స్థలాన్ని గుర్తించి, ఆక్రమణలను తొలగించాలని వాహన దారులు కోరుతున్నారు. అవసరమైతే పోలీసు, మున్సి పల్, రెవెన్యూ, హైవే శాఖల అధికారులు సమన్వ యంతో ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

### రద్దీ వేళ వాహనదారులకు నరకయాతన

పోస్ట్ ఆఫీస్ నుంచి ఖమ్మం వైపు వెళ్లే ఈ రహదారి కొత్తగూడెం పట్టణానికి అత్యంత కీలకమైన మార్గం. నిత్యం వందలాది వాహనాలు ఈ దారిలో ప్రయాణిస్తుం టాయి. ఇలాంటి ప్రధాన రహదారిపై ఆక్రమణలు పెరిగిపోవడంతో రద్దీ వేళల్లో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు."త్రీ లైన్ హైవే ఉన్నా ప్రయో జనం ఏమిటి? వెళ్లడానికి రోడ్డు లేకుండా పోతోంది" అని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు, కార్లు, ద్విచక్ర వాహ నాలు ఒకేసారి ప్రయాణించే సమయంలో తీవ్ర ఇబ్బం దులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. అదే సమ యంలో రహదారి ఆక్రమణలకు పాల్పడే వారిపై నిరం తర పర్యవేక్షణ ఉండాలని కోరుతున్నారు. ఒకసారి ఆక్రమణలు తొలగించిన తర్వాత మళ్లీ అదే పరిస్థితి ఏర్పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రజల ప్రాణ భద్రత, వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని నేషనల్ హైవే-30పై తక్షణమే ప్రత్యేక ఆక్రమణల తనిఖీ చేపట్టాలని ప్రజలు కోరుతు న్నారు. రహదారి పరిధిలో ఉన్న బడ్డీ కొట్లు, కూరగా యల దుకాణాలు, ఇతర ఆక్రమణలను గుర్తించి తొలగిం చాలని, అద్దెలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. అధికా రులు ఇప్పటికైనా స్పందించి హైవేను ఆక్రమణల నుంచి విముక్తి చేస్తారా? లేక ప్రమాదం జరిగిన ప్రతిసారీ తాత్కాలిక చర్యలకే పరిమితం అవుతారా? అన్నది వేచి చూడాల్సిందే.

# అందుబాటులో అధికారి.. అభివృద్ధి బాటలో ..

# ఏదులాపురం మున్సిపాలిటీ

**ప్రజల మధ్యే ఏదులాపురం కమిషనర్**

**సమస్య ఏదైనా.. పరిష్కారం తక్షణమే!**

**ప్రజల చెంతకు పాలన..**

**ప్రజా సమస్యలపై తక్షణ స్పందన..**

**అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**

**ప్రజల సమస్యే ప్రాధాన్యం.. అభివృద్ధే లక్ష్యం**

**క్షేత్రస్థాయిలో కమిషనర్..**

**మారుతున్న ఏదులాపురం**

**ప్రజల గడప వద్దకు పాలన..**

**పనిలో వేగం.. సమస్యల పరిష్కారంలో చొరవ**

**ప్రజలకు చేరువగా కమిషనర్**

**ఎదులాపురం మున్సిపాలిటీ అభివృద్ధిలో కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవ**






ఖమ్మం రూరల్,ప్రభాతవార్త

ప్రజలకు అందుబాటులో ఉంటూ.. వారి సమస్యలను తెలుసుకుంటూ.. పరిష్కారం కోసం అక్కడికక్కడే అధికా రులను అప్రమత్తం చేస్తూ.. మున్సిపాలిటీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారు ఆళ్ల శ్రీనివాసరెడ్డి. ఏదులా పురం మున్సిపాలిటీ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహి స్తున్న ఆయన.. కార్యాలయానికే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటున్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడ సమస్య తలెత్తినా స్పందిస్తూ.. సంబంధిత సిబ్బందితో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ప్రజలకు మున్సిపల్ కార్యాలయంపై, అధికార యంత్రాంగంపై నమ్మకం పెరుగుతోంది.

### ప్రజల వద్దకే పాలన..

ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో జాప్యం ఉండకూడదన్నదే తన ప్రధాన లక్ష్యంగా కమిష నర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి వ్యవహరిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. సాధారణంగా మున్సిపల్ కార్యాలయానికి వచ్చే ప్రజలు తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఇబ్బందులు పడుతుంటారు. అయితే ఇలాంటి పరిస్థితి ఎదులాపురం మున్సిపాలిటీలో లేకుండా ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఆయన వ్యవహరిస్తున్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా చెప్పే అవకాశం కల్పించడంతో పాటు.. వాటి పరిష్కారా నికి సంబంధిత విభాగాల సిబ్బందికి సూచనలు చేస్తున్నారు. తాగునీటి సరఫరా, పారిశుధ్యం, డ్రైనేజీ, వీధి దీపాలు, రహదారులు, చెత్త సేకరణ, మురుగు కాలువల నిర్వహణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. చిన్న సమస్య అయినా నిర్లక్ష్యం చేయకుండా.. అది పెద్ద సమస్యగా మారకముందే పరిష్కరించాలన్న విధానంతో ముందుకు సాగుతున్నారు.

### క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ..

మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు కాగితాలకే పరిమి తం కాకుండా ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలన్న ఉద్దేశంతో కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణకు ప్రాధా న్యం ఇస్తున్నారు. ఆయా వార్డుల్లో జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలిస్తూ.. నాణ్యత విషయంలో రాజీ పడకూడదని సిబ్బందికి సూచిస్తున్నారు. ప్రజలకు అవస రమైన మౌలిక వసతులను గుర్తించి వాటికి అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నారు. మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య నిర్వహణపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రజారోగ్యానికి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

### సమస్య కనిపిస్తే.. పరిష్కారం దిశగా అడుగులు

మున్సిపాలిటీలో ఏదైనా సమస్య తన దృష్టికి వస్తే.. దాని పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవడమే కమిష నర్ విధానంగా కనిపిస్తోంది. ప్రజలు ఫిర్యాదు చేసిన తర్వాతే స్పందించడం కాకుండా.. క్షేత్రస్థాయిలో సమస్య లను గుర్తించి ముందుగానే పరిష్కరించేందుకు ప్రయత్ని స్తున్నారు. ఇందుకోసం అధికారులు, మున్సిపల్ సిబ్బంది తో నిరంతరం సమన్వయం చేసుకుంటున్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా వాటి పరిష్కారంపై సంబంధిత సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. ఒక సమస్య పరిష్కారమైందా లేదా అన్నది కూడా తెలుసుకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు. దీంతో ఫిర్యాదు చేసిన ప్రజలకు తమ సమస్యకు పరిష్కారం లభిస్తుందనే భరోసా కలుగుతోంది.

### అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ఏదులాపురం మున్సిపాలిటీని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు అందుబాటులో ఉన్న వనరులను సమర్థ ంగా వినియోగించుకోవడంపై కమిషనర్ దృష్టి సారిస్తు న్నారు. ఇప్పటికే ఉన్న మౌలిక వసతులను మెరుగు పరచడంతో పాటు.. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులకు ప్రణాళిక రూపొందించా ల్సిన అవసరాన్ని గుర్తిస్తున్నారు. వార్డుల వారీగా ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కా రానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ముఖ్యంగా తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు వంటి ప్రజల నిత్యజీవితానికి సంబంధించిన అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా మున్సిపల్ పాలన ప్రజలకు మరింత చేరువయ్యేలా చర్యలు చేపడుతున్నారు.

### సిబ్బందితో సమన్వయం..

మున్సిపాలిటీ అభివృద్ధి ఒక్క అధికారి వల్లే సాధ్యం కాదని.. అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే ఫలితాలు వస్తాయని కమిషనర్ భావిస్తున్నారు. ఈ క్రమంలో మున్సిపల్ సిబ్బందితో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ విధులపై స్పష్టమైన సూచనలు చేస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తమ పరిధిలోని పనులను బాధ్యతగా నిర్వహించాలని సూచిస్తున్నారు. ప్రజాప్రతినిధులు సూచి ంచే సమస్యలను కూడా పరిగణనలోకి తీసుకుంటూ.. వాటి పరిష్కారానికి అధికారికంగా చర్యలు తీసుకునేలా సమన్వయం చేస్తున్నారు. దీంతో వార్డుల్లోని సమస్యలు మున్సిపల్ యంత్రాంగం దృష్టికి త్వరగా చేరుతున్నాయి.

### అందుబాటులో ఉండే అధికారిగా గుర్తింపు

ప్రజలకు అందుబాటులో ఉండే అధికారి అన్న గుర్తింపు పొందడం అంత సులభం కాదు. అందుకు ప్రజల సమస్యలను ఓపికగా వినడం.. వాటిపై స్పందించడం.. పరిష్కారం కోసం చర్యలు తీసుకోవడం అవసరం. ఈ మూడు అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి పనిచేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నా రు. మున్సిపల్ కార్యాలయానికి వచ్చే ప్రజలు తమ సమస్యను చెప్పుకునేందుకు వెనుకాడకుండా ఉండే వాతావరణాన్ని కల్పించడమే కాకుండా.. క్షేత్రస్థాయిలో కూడా అందుబాటులో ఉండటం ఆయన పనితీరులో ప్రత్యేకతగా మారింది. అధికారులు ప్రజలకు చేరువగా ఉంటేనే ప్రభుత్వ పథకాలు, మున్సిపల్ సేవలు సకాలంలో ప్రజలకు అందుతాయనే భావనతో ఆయన ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది.

### 'పరిష్కారం'పైనే గురి..

ప్రజలు సమస్యతో కార్యాలయానికి వచ్చినప్పుడు 'సమస్య ఏమిటి?' అని అడగడం మాత్రమే కాకుండా.. 'ఎలా పరిష్కరించాలి?' అనే దానిపై దృష్టి పెట్టడం కమిషనర్ పనితీరులో ప్రధాన అంశంగా కనిపిస్తోంది. సమస్య చిన్నదైనా.. పెద్దదైనా ప్రజలకు ఇబ్బంది కలిగించేదైతే దానిని పరిష్కరించాల్సిందే అన్న విధానంతో ముందుకు సాగుతున్నారు. ఇక మున్సిపాలిటీ అభివృద్ధి పనుల్లో వేగంతో పాటు నాణ్యతకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచిస్తున్నారు. అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత వాటి ప్రయోజనం ప్రజలకు ఎంతవరకు అందుతుందనే అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరాన్ని చెబుతున్నారు.

### ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి

మున్సిపాలిటీ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కూడా కీలకమని అధికారులు భావిస్తున్నారు. పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణ, తాగునీటి వినియోగం, ప్రజా వనరుల పరిరక్షణ వంటి అంశాల్లో ప్రజలు సహకరిస్తే మున్సిపాలిటీని మరింత మెరుగ్గా తీర్చిదిద్దవచ్చని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు తమ పరిసరాల్లో కనిపించే సమస్యలను మున్సిపల్ యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని.. వాటి పరిష్కారానికి అధికారులు, సిబ్బంది కలిసి పనిచేస్తేనే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొంటున్నారు.

### ముందుచూపుతో.. నిరంతర పర్యవేక్షణతో..

ఏదులాపురం మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి చేస్తున్న ప్రయత్నాలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. ప్రజల సమస్యల పరిష్కారానికి తక్షణ స్పందన, అభివృద్ధి పనులపై పర్యవేక్షణ, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ, సిబ్బందితో సమన్వయం.. ఇలా అన్ని అంశాల్లో చురుకుదనం ప్రదర్శిస్తున్నారు... అధికారి కార్యాలయంలో ఉంటే పరిపాలన సాగుతుంది.. కానీ అధికారి ప్రజల మధ్య ఉంటేనే పాలనపై నమ్మకం పెరుగుతుంది... ఈ విధానానికి అనుగుణంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ.. సమస్యలను తెలుసుకుంటూ.. పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటున్న కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి పనితీరు ఎదులాపురం మున్సిపాలిటీ అభివృద్ధికి దోహదపడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# స్టెమ్‌స్పార్క్ రెజోనెన్స్ లో వినాయకచవితి వేడుకలు

ఖమ్మం విద్యా విభాగం సెప్టెంబర్ 12, ప్రభాతవార్త:

స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ స్కూల్‌లో వినాయక చవితి పండుగ సందర్భంగా సకలాభీష్ట ప్రదాత అయిన వినాయకుని పుట్టిన రోజు వేడుక వినాయక చవితిని భక్తి శ్రద్దలతో నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ కొరకు మట్టి గణపతి విగ్రహాలను చిన్నారులు తమ చిన్ని చిన్ని చేతులతో తయారుచేసి, ఆ విగ్రహలకు పూజలు జరిపి అందరికీ ఉండ్రాళ్ళు, కుడుములు పంచారు. ఈ కార్యక్రమానికి స్కూల్ డైరెక్టర్స్ కొండా శ్రీధర్ రావు కొండా కృష్ణవేణి పాల్గొని మట్టి గణపతుల విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వినాయక చవితి పండుగ విశిష్టతను తెలియజేసి ప్రకృతి శక్తులను పూజించే గొప్ప సంస్కృతి మన భారతీయ పండుగలలో వినాయక చవితి ఒకటి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.




# వసతి గృహంలో ఎలుకల కలకలం!



**విద్యార్థినులపై వరుస దాడులు.. భద్రత గాలిలో!**

**మూడు రోజుల వ్యవధిలో ఏడుగురికి గాయాలు.. ఆస్పత్రికి తరలించి చికిత్స**

**ఘటనలను ఉన్నతాధికారులకు చెప్పలేదన్న ప్రిన్సిపాల్.. 'చిన్న విషయమే' అంటూ సమర్థింపు**

**సారపాక మైనార్టీ బాలికల కళాశాల వసతి గృహంలో భయాందోళన**

సారపాక, ప్రభాతవార్త:

విద్యార్థినులకు భద్రత కల్పించాల్సిన వసతి గృహమే ఎలుకల దాడులకు నిలయంగా మారింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం సారపాక తెలంగాణ రాష్ట్ర మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల కళాశాల వసతి గృహంలో విద్యార్థినులపై ఎలుకలు వరుసగా దాడి చేసిన ఘటనలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. ఒకసారి కాదు.. రెండు సార్లు దాడులు జరగడం, మూడు రోజుల వ్యవధిలో ఏడుగురు విద్యార్థినులు గాయపడినట్లు సమాచారం వెలువడటం కలకలం రేపుతోంది. ఘటనల తీవ్రతపై విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ఒకే భవనంలో కళాశాల.. వసతి గృహం

సారపాకలో తెలంగాణ రాష్ట్ర మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల కళాశాల, వసతి గృహం ఒకే భవనంలో కొనసాగుతున్నాయి. ఫస్టియర్, సెకండియర్ విద్యార్థినులు కలిపి సుమారు 160 నుంచి 200 మంది ఇక్కడ విద్యనభ్యసిస్తూ వసతి పొందుతున్నారు. రాత్రివేళ విద్యార్థినులు నిద్రిస్తున్న సమయంలో ఎలుకలు గదుల్లోకి ప్రవేశించి దాడులకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

### 3న ముగ్గురు.. 9న మరో నలుగురు

ఈ నెల 3వ తేదీన ముగ్గురు విద్యార్థినులపై ఎలుకలు దాడి చేసి గాయపరిచినట్లు సమాచారం. ఆ ఘటన మరువకముందే 9వ తేదీ రాత్రి మరో నలుగురు విద్యార్థినుల కాళ్లపై ఎలుకలు దాడి చేసినట్లు తెలిసింది. వరుస ఘటనలతో వసతి గృహంలో ఉంటున్న విద్యార్థినుల్లో భయాందోళన నెలకొన్నట్లు సమాచారం. 9వ తేదీన గాయపడిన విద్యార్థినులను వసతి గృహ సిబ్బంది భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు, చికిత్స చేయించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. అనంతరం విద్యార్థినులను తిరిగి వసతి గృహానికి తీసుకొచ్చినట్లు చెప్పారు.

### డ్రైనేజీ నుంచే ఎలుకలు వస్తున్నాయా?

వసతి గృహంలో ఎలుకల బెడదకు డ్రైనేజీ వ్యవస్థ కారణమై ఉండవచ్చని కళాశాల యాజమాన్యం గుర్తించినట్లు తెలుస్తోంది. ఎలుకలు డ్రైనేజీ నుంచి వస్తున్న విషయాన్ని సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లామని, ఎలుకలు ప్రవేశించకుండా డ్రైనేజీని మూసివేసినట్లు ప్రిన్సిపాల్ జ్యోతి వివరించారు. అయితే కేవలం డ్రైనేజీ మూసివేతతో సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందా? వసతి గృహంలోని ఇతర ప్రాంతాల్లో ఎలుకల ఉనికిని గుర్తించి శాశ్వత నివారణ చర్యలు చేపట్టారా? విద్యార్థినుల గదులు, వంటగది, భోజనశాల, పరిసరాలను పూర్తిస్థాయిలో పరిశుభ్రం చేశారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### ఉన్నతాధికారులకు సమాచారం లేదా?

వరుసగా విద్యార్థినులు ఎలుకల దాడికి గురవుతున్నప్పటికీ ఘటనలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై ప్రిన్సిపాల్ జ్యోతిని వివరణ కోరగా విద్యార్థినులకు ఆస్పత్రిలో చికిత్స చేయించినట్లు తెలిపారు. అయితే ఘటనను ఉన్నతాధి కారులకు తెలియజేశారా అని ప్రశ్నించగా 'చిన్న విష యమే కదా' అని సమాచారం ఇవ్వలేదని పేర్కొన్నట్లు సమాచారం. విద్యార్థినుల ఆరోగ్యం, భద్రతకు సంబం ధించిన ఘటనను ఉన్నతాధికారులకు తెలియజే యకపోవడంపై తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. వసతి గృహంలో ఒకసారి ఎలుకల దాడి జరిగినప్పుడు వెంటనే నివారణ చర్యలు చేపట్టి ఉంటే రెండోసారి ఘటనలు జరిగేవి కావని వారు అభిప్రాయపడుతున్నారు.



### తల్లిదండ్రుల్లో ఆందోళన

తమ పిల్లలను ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంచి చదివిస్తున్న తల్లిదండ్రులు వారి భద్రతపై నమ్మకం పెట్టుకుంటారు. అయితే విద్యార్థినులు నిద్రిస్తున్న సమయంలో ఎలుకలు దాడి చేయడం, ఒకే నెలలో పలువురు గాయపడినట్లు సమాచారం రావడం ఆందోళన కలిగిస్తోంది. చిన్నారులు, యువతులు ఉండే వసతి గృహాల్లో పారిశుధ్యం, ఆహార భద్రత, భవన భద్రత, క్రిమికీటకాల నియంత్రణ వంటి అంశాలను అధికారులు నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

ఈ ఘటనపై శనివారం విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టి నివేదికను ఉన్నతి అధికారుల దృష్టికి తీసుకువెళ్లను ఉన్నట్లు సమాచారం.

### శాశ్వత పరిష్కారం ఏదీ?

డ్రైనేజీ మూసివేతతో పాటు వసతి గృహం మొత్తాన్ని పరిశీలించి ఎలుకల ఉనికిని పూర్తిగా నిర్మూలించేందుకు శాస్త్రీయ పద్ధతుల్లో చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. గదులు, మంచాలు, స్టోర్ రూములు, వంటగది, ఆహార నిల్వ ప్రాంతాలు, డ్రైనేజీలు, చెత్త నిల్వ ప్రాంతాలను పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. వరుస ఘటనల నేపథ్యంలో మైనార్టీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు, సంబంధిత జిల్లా అధికారులు తక్షణమే వసతి గృహాన్ని తనిఖీ చేసి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి, వసతి గృహ పారిశుధ్యం, ఎలుకల నియంత్రణకు తీసుకున్న చర్యలు, ఘటనలను అధికారులకు తెలియజేసిన విధానం తదితర అంశాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విద్యార్థినుల భద్రత విషయంలో 'చిన్న ఘటన'గా తీసుకోకుండా ప్రతి ఫిర్యాదును తీవ్రంగా పరిగణించి, మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు, విద్యార్థినుల తరఫున పలువురు కోరుతున్నారు.

# సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి

**మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 12:** ఈ నెల 17ను తెలంగాణ విలీన దినోత్సవంగా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని, సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా అన్నారు. ఆయన శనివారం మణుగూరు సీపీఐ కార్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సభలో పాల్గొని మాట్లాడారు. భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన రైతాంగ పోరాటంలో కమ్యూనిస్టుల నాయకత్వంలో 24 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేసిన ఘనత సీపీఐదేనన్నారు.



5 వేల మంది ప్రాణత్యాగాలు చేసిన ఈ చారిత్రక వాస్తవాలను పక్కనపెట్టి, మత రాజకీయం చేస్తూ చరిత్రను వక్రీకరించడం సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి కమ్యూనిస్టుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాలని కోరారు. తొలుత రైతు సంఘం జిల్లా నాయకుడు మంగి వీరయ్య పార్టీ జెండాను ఆవిష్కరించగా, నాయకులు అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి లక్ష్మీకుమారి, మండల, పట్టణ కార్యదర్శులు జక్కుల రాజబాబు, దుర్గ్యాల సుధాకర్, వై. రాంగోపాల్, ఎడారి రమేష్, సోందే కుటుంబరావు, గడ్డం వెంకటేశ్వర్లు, తోట రమేష్, చింతల దశరథం, వేర్పుల నరేష్, తోగటి కుమార్, సర్వర్ తదితరులు పాల్గొన్నారు.

# మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్టించి పూజించాలి

**మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 12:** వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, పర్యావరణహితమైన మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్టించి పూజించాలని సింగరేణి మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్ కోరారు. ఆయన శనివారం స్థానిక జీఎం కార్యాలయంలో పర్యావరణ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ఏరియా అధికారులు,



ఉద్యోగులు, మహిళలకు విగ్రహాలను అందజేశారు. అనంతరం జీఎం మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు, రసాయనిక రంగుల వల్ల నీటి వనరులు, జలచరాలు, పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటాయన్నారు. మట్టి విగ్రహాలను ఉపయోగించడం ద్వారా ఉత్సవాలను పర్యావరణహితంగా నిర్వహించుకోవచ్చని తెలిపారు. ప్రతి ఏటా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తూ అవగాహన కల్పిస్తున్న పర్యావరణ విభాగం అధికారులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్వో టూ జీఎం డి. వెంకట రామారావు, ఏజీఎం (ఐఈడీ) సీహెచ్. రాంబాబు, ఏరియా ఇంజనీర్ మధన్ నాయక్, ఎన్విరాన్మెంట్ ఆఫీసర్ జె. శ్రీనివాసరావు, ఫైనాన్స్ మేనేజర్ పి. రమేష్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ కె. శ్రీనివాస్, జీఎం పిఏ ఆర్.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

**అశ్వాపురం, ప్రభాతవార్త, సెప్టెంబర్ 12:** తెలంగాణ విముక్తి దినమైన సెప్టెంబర్ 17ను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1947 సెప్టెంబర్ 11న బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారని గుర్తుచేశారు. కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో సాగిన సాయుధ పోరాటం కారణంగా వేలాది గ్రామాలు విముక్తి పొందాయని, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడి పేదలకు భూములు దక్కేలా ఉద్యమం సాగిందని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను కేవలం హిందూ-ముస్లిం వివాదంగా చిత్రీకరించడం చరిత్రను వక్రీకరించడమేనని వెంకటేశ్వర్లు విమర్శించారు. షేక్ బంధగి, షోయబుల్లా ఖాన్, మఖ్దూం మొహియుద్దీన్ వంటి ముస్లిం యోధులు కూడా నిజాం, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణత్యాగం చేశారని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో వివిధ వర్గాల ప్రజలు భాగస్వాములయ్యారని అన్నారు. సెప్టెంబర్ 17ను గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అధికారిక కార్యక్రమంగా కాకుండా పార్టీ కార్యక్రమాలకే పరిమితం చేస్తోందని ఆయన విమర్శించారు. నిజాం పాలనలో ఉన్న ప్రాంతాల్లో మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహిస్తున్నప్పుడు తెలంగాణలో మాత్రం ఎందుకు అధికారికంగా నిర్వహించడం లేదని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను భావితరాలకు తెలియజేసేలా రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలని కమటం వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.

## అన్ని యూనియన్లను ఆహ్వానించాలి.



**మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 12:** సింగరేణి లో గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాల కాలపరిమితి ముగిసినందున సింగరేణి నిర్వహించే అధికారిక సమావేశాలకు అన్ని యూనియన్లను సమానంగా ఆహ్వానించాలని సీఐటీయూ డిమాండ్ చేస్తూ శనివారం మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్ కు, పీకే ఓసీ2 మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం బ్రాంచ్ కార్యదర్శి వల్లూరు వెంకటరత్నం మాట్లాడుతూ.. గుర్తింపు సంఘం రెండేళ్ల కాలపరిమితి తీరిపోవడంతో వేతనాల నుండి చందా రికవరీలను వెంటనే నిలిపివేయాలన్నారు. తదుపరి ఎన్నికలు జరిగే వరకు యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా చర్చల్లో అన్ని సంఘాలకు సమాన అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు లక్ష్మణరావు, ముజాఫర్, సాయికృష్ణ, సుమన్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీలకు ఆర్థిక స్వేచ్ఛ

**అశ్వాపురం, ప్రభాతవార్త, సెప్టెంబర్ 12:** గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ఇకపై పంచాయతీల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసుకుని, గ్రామసభ తీర్మానం మేరకు ఆ నిధులను వినియోగించుకునేలా చట్ట సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలపడం పట్ల పలువురు సర్పంచులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామాల అభివృద్ధికి పంచాయతీల సొంత ఆదాయం సకాలంలో అందుబాటులో ఉండేలా కీలక నిర్ణయం తీసుకున్న ప్రభుత్వానికి, మంత్రి సీతక్కకు సర్పంచులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీలకు ఆర్థిక స్వేచ్ఛ కల్పిస్తూ ప్రజల ప్రయోజనాల కోసం తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. ఈ నిర్ణయంతో గ్రామ పంచాయతీలు మరింత వేగంగా అభివృద్ధి బాటలో పయనిస్తాయని సర్పంచులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రభుత్వానికి వెంకటాపురం సర్పంచ్ మడకం మాలమ్మ, తుర్రం వారి గూడెం సర్పంచ్ కుంజా జానుు, మిట్టగూడెం సర్పంచ్ జిమ్మా రూప్నీ, ఉపసర్పంచ్ లు ధరావత్ హర్షానాయక్, శీలం సంజీవ రెడ్డి, షేక్ రసూల్ బీ కృతజ్ఞతలు తెలిపారు.

## రాష్ట్ర ఆర్అండ్‌బీమంత్రిని కలిసిన ఎమ్మెల్యే పాయం

**మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 12:** రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం కలిశారు. ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇటీవల పినపాక నియోజకవర్గంలోని బీటీ రహదారులు, వంతెనలు, బ్రిడ్జిల అభివృద్ధి కోసం హెచ్ఏఎం విధానంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.186 కోట్లు మంజూరు చేయడంతో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ప్రత్యేకంగా ఎమ్మెల్యే పాయం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.




## అన్ని కార్మిక సంఘాలకు ప్రాధాన్యత ఇవ్వాలి



**మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 12:** సింగరేణి కాలరీస్ కంపెనీలో గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాల కాలపరిమితి ఈ నెల 8తో ముగిసిన దృష్ట్యా వెంటనే కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించాలని మణుగూరు ఏరియా టీబీజీకెయస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు అన్నారు. ఆయన శనివారం టీబీజీకెయస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొప్పుల ఈశ్వర్ దిశానిర్దేశం, రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి ఆదేశాల మేరకు మణుగూరు ఏరియాజీ ఎం దుర్గం రామచందర్, ఏజీఎం (పర్సనల్) ఎస్.రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు జరిగే వరకు ఏ ఒక్క సంఘానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వకుండా అన్ని కార్మిక సంఘాలకు సమాన హోదా, అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేసి, ఓట్ల ద్వారా కార్మికులు తమ ప్రతినిధి సంఘాన్ని ఎన్నుకునే అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బంగారి పవన్ కుమార్, జంగం రాజ్ కుమార్, బొద్దుల ప్రవీణ్ కుమార్, కమటం పరమేష్, మస్తాన్, పి.కె. నాగరాజు, పద్దం శ్రీనివాస్, రమేష్ బాబు, అజ్మీరా అశోక్, కళ్యాణ్ కుమార్, సర్వే నరేష్, కటారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రాజీ మార్గం వైపు ప్రోత్సహించాలి : మణుగూరు కోర్టు మేజిస్ట్రేట్ కంభపు సూరిరెడ్డి



**మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్12:** లోక్ అదాలత్‌ల ద్వారా కేసులను పరిష్కరించుకొని కక్షిదారులు ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని, పట్టింపులకు పోకుండా సామరస్యపూర్వక పరిష్కారానికి ముందుకు రావాలని, న్యాయవాదులు కూడా కక్షిదారులను రాజీ మార్గం వైపు ప్రోత్సహించాలని మణుగూరు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కంభపు సూరిరెడ్డి అన్నారు. ఆయన శనివారం మణుగూరు కోర్టు ఆవరణలో నిర్వహించిన న్యాయ చైతన్య సదస్సులో పాల్గొని మాట్లాడారు. కోర్టుల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రాజీపడదగిన కేసులను లోక్ అదాలత్‌లో పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవడం వల్ల సమయం, ఆర్థిక భారం తగ్గుతాయని అన్నారు. అనంతరం నిర్వహించిన లోక్ అదాలత్‌లో మొత్తం 342 కేసులు పరిష్కారమైనట్లు, ఇందులో ముఖ్యం పోలీస్, ప్రైవేట్ కేసులు 94 పరిష్కారమై జరిమానా, సెటిల్మెంట్ల రూపంలో రూ.38,49,400 చెల్లింపులు జరిగినట్లు, పెట్టీ కేసులు 244 లో నేరం అంగీకరించడంతో రూ.1,96,800 జరిమానా విధించినట్లు, ఈచలానా కేసులు 52 పరిష్కారమై రూ.23,400 రాజీ కుదిరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మణుగూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రకాని గురుకృష్ణ, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ వీరంకి పద్మావతి, ప్రధాన కార్యదర్శి వీర మధుసూదన్, ఉపాధ్యక్షురాలు సావిత్రి, సీనియర్ న్యాయవాదులు పి.కిషన్ రావు, జె.చొక్కయ్య, ఎ.రామ్మోహన్ రావు, రవికుమార్, ఎ.శ్రీనివాస్ రావు, సరస్వతి, సర్వేశ్వర రావు, సంధ్య, వాసవి తదితరులు పాల్గొన్నారు.

# పల్లెలపై గంజాయి దండయాత్ర

**కొమరారం, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త:** ఒకప్పుడు ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో ఇప్పుడు గంజాయి, డ్రగ్స్ పంజా విస్తరిస్తోందని, యువత భవిష్యత్తును మత్తు మాఫియా కబళిస్తుంటే ప్రభుత్వం, అధికార యంత్రాంగం ప్రేక్షక పాత్ర పోషిస్తోందని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా అధ్యక్షుడు పూణెం మంగన్న తీవ్రస్థాయిలో విమర్శించారు. శనివారం కొమరారంలో ఊకె శ్రావణ్ అధ్యక్షతన జరిగిన పీవైఎల్ ఇల్లందు డివిజన్ కమిటీ సమావేశంలో డ్రగ్స్, గంజాయి, సీజనల్ వ్యాధుల నిర్మూలనపై ప్రత్యేక తీర్మానాలు చేశారు. అనంతరం మంగన్న మాట్లాడుతూ, డ్రగ్స్ నియంత్రణ పేరుతో ప్రభుత్వం ప్రచారం చేస్తున్నా గ్రామాల్లో గంజాయి విచ్చలవిడిగా దొరుకుతోందని ఆరోపించారు. గంజాయి ఇప్పుడు నగరాలకే



పరిమితం కాదు గ్రామాల గడప పట్టింది. పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లోనూ యువతను లక్ష్యంగా చేసుకుని మత్తు ముఠాలు వల విసురుతున్నాయి. అని ఆయన అన్నారు మత్తు వ్యసనాల కారణంగా యువత చదువులకు దూరమవడం, కుటుంబాల్లో కలహాలు, నేరాల పెరుగుదల, ఆర్థిక ఇబ్బందులు తీవ్రమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో గంజాయి విక్రయాలు సాగుతున్నా పట్టించుకునే అధికారులు కనిపించడం లేదని, అక్రమ రవాణా, విక్రయాల వెనుక ఉన్న ముఠాలపై కఠిన చర్యలు తీసుకుని యువతను రక్షించాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో ప్రత్యేక నిఘా కమిటీలు ఏర్పాటు చేసి గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కోరారు. సమాజాన్ని మత్తు రహితంగా మార్చాలనే లక్ష్యంతో పీవైఎల్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు గ్రామాల్లో అవగాహన సదస్సులు, ర్యాలీలు, యువజన సమావేశాలు నిర్వహించి యువతను చైతన్యపరిచే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పీవైఎల్ ఇల్లందు డివిజన్ కార్యదర్శి ఎలుగు శాంతారావు, నాయకులు భూక్యా వెంకన్న, బాధావత్ రమేష్, వల్లోజు చంద్రశేఖర్, కుంజా నరేష్, కోడి కృష్ణ, చందావత్ లక్ష్మణ్, అజ్మీర కిషన్, కల్తీ సుదర్శన్ పాల్గొన్నారు.

# భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులకు అప్‌గ్రేడ్ చేయాలి

**ఇల్లందు, సెప్టెంబర్ 12 ,ప్రభాతవార్త:** గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో విధులు నిర్వహిస్తున్న భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులకు అప్‌గ్రేడ్ కల్పించాలని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కోరారు. ఈ మేరకు ట్రైబల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ, అప్‌గ్రేడ్ కోసం ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులతో కలిసి గిరిజన సంక్షేమ శాఖ మంత్రిని కలిసి మెమొరాండం అందజేశారు. అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో పనిచేస్తున్న భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల అప్‌గ్రేడ్ అంశాన్ని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ పరిధిలో పనిచేస్తున్న భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులకు ఇప్పటికే అప్‌గ్రేడ్ కల్పించారని, అదే విధంగా గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కూడా అప్‌గ్రేడ్ కల్పించాల్సిన



అవసరం ఉందని సభ దృష్టికి తీసుకెళ్లారు. ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి ఒకే విధమైన విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల్లో శాఖల వారీగా అప్‌గ్రేడ్ విషయంలో వ్యత్యాసం ఉండకూడదని, గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో పనిచేస్తున్న భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులకు కూడా అప్‌గ్రేడ్ కల్పించి న్యాయం చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సమస్యను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేల సహకారంతో మెమొరాండం ఉపాధ్యాయుల అప్‌గ్రేడ్ సమస్య పరిష్కారం కోసం ఉమ్మడి ఖమ్మం జిల్లా గిరిజన ఎమ్మెల్యేలు, కొత్తగూడెం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్, ఖానాపూర్ ఎమ్మెల్యేల సహకారంతో రూపొందించిన మెమొరాండంను గిరిజన సంక్షేమ శాఖ మంత్రికి అందజేశారు. అప్‌గ్రేడ్‌కు సంబంధించిన అంశాలను మంత్రికి వివరించి, గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకోవాలి ఏళ్లుగా అప్‌గ్రేడ్ కోసం ఎదురుచూస్తున్న ఉపాధ్యాయుల సమస్యపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని ట్రైబల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఇతర శాఖల్లో అప్‌గ్రేడ్ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కూడా సమాన అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో పాటు యంపీ నాయక్, మాలోత్ ప్రతాప్ సింగ్, గూగులోత్ నరేష్, హరికిషన్, సురేష్ బాబు, నాగ ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ ఉపాధ్యాయుల ఫెడరేషన్ నూతన కమిటీ ఎన్నిక

**జిల్లా అధ్యక్షుడిగా కారం రాంబాబు..**

**ప్రధాన కార్యదర్శిగా ఊకె కృష్ణ**

**ఇల్లందు అర్బన్ ,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ ఉపాధ్యాయుల ఫెడరేషన్ భద్రాద్రి జిల్లా నూతన కమిటీని శనివారం ఇల్లందు మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కబ్బాకుల రవి హాజరై మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీలకు ఉపాధ్యాయ, ఉద్యోగ నియామకాల్లో 100 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి జీవో నంబర్ 3కు చట్టబద్ధత సాధించేందుకు ఆదివాసీ ఉపాధ్యాయులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం ఫెడరేషన్ నిరంతరం ఉద్యమిస్తుందని తెలిపారు. పదోన్నతుల్లోనూ ఆదివాసీలకు న్యాయంఏజెన్సీ ప్రాంతాల్లో




ఆదివాసీ ఉపాధ్యాయులకు 100 శాతం పదోన్నతులు సాధించిన ఘనత తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ ఉపాధ్యాయుల ఫెడరేషన్‌కే దక్కుతుందని వారు పేర్కొన్నారు. ఆదివాసీ ఉపాధ్యాయులు సంఘాన్ని బలోపేతం చేసి, జీవో నంబర్ 3కు చట్టబద్ధత సాధించే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలను ఎప్పటికప్పుడు మండల, జిల్లా స్థాయిలో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ఫెడరేషన్ కృషి చేస్తుందని తెలిపారు. భద్రాద్రి జిల్లా నూతన కమిటీరాష్ట్ర ప్రచార కార్యదర్శి కుర్సం అంజయ్య ఎన్నికల అధికారిగా వ్యవహరించి భద్రాద్రి జిల్లా నూతన కమిటీని ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడు: కంగాల వెంక య్యఅధ్యక్షుడు: కారం రాంబాబు ప్రధాన కార్యదర్శి: ఊకె కృష్ణఉపాధ్యక్షులు: పాయం విజయ్‌బాబు, కోరం శంతారావుకోశాధికారి: పూనెం బాలరాజుకార్యదర్శులు: ముడిగ వెంకటేశ్వర్లు, పూనెం కమలాకర్, పెండకట్ల నాగేశ్వరరావు, మోకాళ్ల మోహన్‌రావు, మోకాళ్ల కృష్ణార్జునరావు, బొల్లి అంజయ్య, పాయం రమేష్, మోకాళ్ల ప్రభాకర్, కల్తీ వీరభద్రం. రాష్ట్ర కార్యదర్శులు: పాయం ఆనందరావు, చాపల రమేష్‌బాబు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి ఉండం నాగేందర్, రాష్ట్ర కార్యదర్శి కుంజా కృష్ణ, మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్తీ భాస్కర్, వివిధ మండలాల బాధ్యులు కొడెం కృష్ణయ్య, తొలెం ఈశ్వర్, అరెం రవికుమార్, కల్తీ రామకృష్ణ, కొర్స ఆదినారాయణ, గలిగె రాంబాబు, ఈసం పగడయ్య, ఊకె పగడయ్య, కల్తీ సత్యం, ఇతర జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం.

**ఏన్కూరు, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచి ఆయన మిత్రులు తమ మానవత్వాన్ని చాటుకున్నారు. తిమ్మారావుపేట గ్రామానికి చెందిన ఇసనపల్లి నాగేశ్వరా వు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి త రలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందారు.




# తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు జయప్రదం చేయాలి




**ఇల్లందు అర్బన్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త:** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు ఘనంగా నిర్వహించి జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కె. సారయ్య పిలుపునిచ్చారు. ఇల్లందులో జరిగిన సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలన, దొరల వెట్టిచాకిరీ, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా రైతులు, కార్మికులు, మహిళలు సాగించిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం చారిత్రాత్మకమైందన్నారు. భూమి, భుక్తి, వెట్టి విముక్తి కోసం జరిగిన పోరాట స్ఫూర్తిని నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. వారోత్సవాల్లో భాగంగా ఇల్లందు ఏరియాలోని గనులు, కార్మిక కాలనీలు, పట్టణంలో ఎర్రజెండా ఆవిష్కరణ, అమరవీరులకు నివాళులు, సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికులు, రైతులు, ప్రజాతంత్రవాదులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని, సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరకొండ శంకర్, పట్టణ, మండల కార్యదర్శులు బాస శ్రీనివాస్, బొప్పిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

**ఇల్లందు అర్బన్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త** :హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం తీసుకురావడంతో పాటు ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కు సారంగపాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 15న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న హమాలీల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం ఇల్లందు పాత బస్టాండ్ సెంటర్‌లో హమాలీ కార్మికుల వద్ద కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించారు. అనంతరం మండల పరిధిలోని నిజాంపేట సహకార సంఘం గోదాం వద్ద సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న కొక్కు సారంగపాణి మాట్లాడుతూ నిత్యం బరువులు మోస్తూ శ్రమిస్తున్న హమాలీ కార్మికుల పట్ల పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బరువులు మోయడం వల్ల అనేక మంది హమాలీలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హమాలీలకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి హమాలీ కార్మికులకు ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులు జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు వివిధ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. 50 సంవత్సరాలు దాటిన హమాలీ కార్మికులకు నెలకు రూ.10 వేల పెన్షన్ అందించాలని, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా హమాలీ కార్మికులకు చట్టబద్ధమైన హక్కులు, కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి సమగ్ర చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర సదస్సుకు పలువురు ప్రముఖులు హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సులో ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి. శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాస్, ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ కొండా నాగేశ్వరరావు పాల్గొని ప్రసంగిస్తారని సారంగపాణి తెలిపారు. హమాలీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ జిల్లా నాయకులు తొండల సర్వయ్య, ప్రకాష్, కొడెం రాజు, జి. రాములు, వెంకన్న, మూతి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల పరిసరాలలో నిలుస్తున్న వరద నీరు

### చిన్నపాటి కుంటను తలపిస్తున్న తీరు
### విద్యార్థులకు తప్పని ఇబ్బందులు

కారేపల్లి, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త





కొద్దిపాటి వర్షం వచ్చిన పాఠశాల అంగన్వాడీ పరిసరాల్లో వరద నీరు నిలిచి చిన్నపాటి కుంటను తలపిస్తున్న తీరు కు నిదర్శనం. రహదారికి దిగువ భాగంలో ఉండటంతో విద్యార్థులు ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రమైన కారేపల్లి బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం వద్ద నేడు ఇలాంటి పరిస్థితి నెలకొంది. ప్రతినిత్యం అంగన్వాడీ కేంద్రానికి 15 మంది చిన్నారులు, నలుగురు గర్భిణీ స్త్రీలు వస్తుంటారు. అలాగే ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 18 మంది విద్యార్థులు చదువుతుండగా, ఇద్దరు ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారు. అయితేవర్షం కురిసిన ప్రతిసారీ పాఠశాల, అంగన్వాడీ కేంద్రం చుట్టూ నీరు నిలిచిపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు బయటకు రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు వర్షపు నీటిలో నుంచి బయటకు రావడం, కనీస అవసరాల కోసం వెళ్లడం కూడా కష్టంగా మారుతోందని అంగన్వాడీ ఉపాధ్యాయురాలు రఘుపతి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాళ్లు విజయలక్ష్మి, అనూష తెలిపారు. పాఠశాల, అంగన్వాడీ కేంద్రం వద్ద నీరు నిలవకుండా అధికారులు వెంటనే పరిశీలించాలని వారు కోరుతున్నారు. లోతట్టు ప్రాంతాన్ని మట్టితో నింపి, వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు చేపట్టి విద్యార్థులకు ఎలాంటి ఆటంకం లేకుండా చూడాల్సిన పరిస్థితి ఎంతైనా ఉంది.

## వైరా-తల్లాడ-ఏన్కూర్-జూలూరుపాడు రహదారిని ఫోర్‌లైన్‌గా విస్తరించాలి

### ఆర్అండ్‌బీ మంత్రి వెంకటరెడ్డిని కోరిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా టౌన్ సెప్టెంబర్ 12 (ప్రభాత వార్త)



వైరా నియోజకవర్గంలో రహదారి మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేసి, ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రవాణా సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ శనివారం అసెంబ్లీ మినిస్టర్స్ ఛాంబర్‌లో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యంగా వైరా నుంచి తల్లాడ మీదుగా ఏన్కూర్, జూలూరుపాడు వరకు ఉన్న ప్రధాన రహదారిని ఫోర్‌లైన్ రోడ్డుగా విస్తరించాలని మంత్రి ని ఎమ్మెల్యే కోరారు. ఈ మార్గంలో నిత్యం భారీగా వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయని, రహదారి ఇరుకుగా ఉండటంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడటంతో పాటు ప్రమాదాలకు కూడా అవకాశం ఉందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వైరా నియోజకవర్గ ప్రజల భద్రత, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ రహదారి విస్తరణను ప్రాధాన్యతతో చేపట్టాలని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారు. అదేవిధంగా వైరా నియోజకవర్గంలోని వివిధ గ్రామాలను ప్రధాన ఆర్అండ్‌బీ రహదారులతో అనుసంధానం చేసేలా కొత్త లింక్ రోడ్ల నిర్మాణం, ప్రస్తుతం ఉన్న ఆర్అండ్‌బీ రోడ్ల అభివృద్ధి, విస్తరణ చేపట్టాలని కూడా ఎమ్మెల్యే కోరారు. నియోజకవర్గంలోని రహదారి వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ద్వారా ప్రజల ప్రయాణం సులభతరం కావడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, వ్యాపార కార్యకలాపాలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే తెలిపారు.

## మద్దులపల్లి లో పశువైద్య శిబిరం విజయవంతం

కామేపల్లి, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:

కామేపల్లి మండలం మద్దులపల్లి గ్రామంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఖమ్మం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన గోపాలమిత్ర పశువైద్య శిబిరం విజయవంతం అయింది. శిబిరంలో ముచ్చర్ల పశువైద్యాధికారి డాక్టర్ గోపికృష్ణ పాల్గొని చూడు కట్టని, ఎదకు రాని, గర్భకోశ వ్యాధులు ఉన్న పశువులకు చికిత్స చేసి రైతులకు మందులు పంపిణీ చేశారు. పశువుల ఆరోగ్య విషయంలో రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రభుత్వ పశు వైద్య సేవలను వినియోగించుకో వాలని కోరారు. ఈ కార్యక్ర మంలో సర్పంచ్ పడిగ నాగమణి, ఉపసర్పంచ్ గడ్డం వెంకటేశ్వర్లు, గోపాల మిత్ర సూపర్వైజర్ వెంకటేష్, గోపాలమిత్ర మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## బ్రిడ్జిపై నుంచి రేషన్ బియ్యం లారీ బోల్తా

### బియ్యం తరలింపుపై అధికారుల విచారణ

వైరా సెప్టెంబర్ 12 (ప్రభాత వార్త)





వైరా సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ హైవేపై శనివారం రేషన్ బియ్యం లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి బ్రిడ్జిపై నుంచి కిందపడిన ఘటన కలకలం రేపింది. ఈ ప్రమాదంలో లారీలో ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేసే సీఎంఆర్ రేషన్ బియ్యం సీఎంఆర్ లేబల్ బస్తాలు ఉన్నట్లు గుర్తించడం పలు అనుమానాలకు తావిస్తోంది. వరంగల్ జిల్లా హనుమకొండ మారుతి ఆగ్రో ఇండస్ట్రీస్ నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్నట్లు చెబుతున్న రేషన్ బియ్యం లారీ వైరా సమీపంలో అదుపుతప్పి బ్రిడ్జిపై నుంచి కింద పడింది. ప్రమాదం అనంతరం లారీలోని బియ్యం బస్తాలను పరిశీలించగా, వాటిపై తెలంగాణ ప్రభుత్వ రేషన్ బియ్యానికి సంబంధించిన సీఎంఆర్ లేబుల్ ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. అయితే లారీలో ఉన్న బిల్లుల్లో కర్ణాటకకు బియ్యం తరలిస్తున్నట్లు వివరాలు ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు లారీ రాజమండ్రి వైపు వెళ్తున్నట్లు సమాచారం ఉండటంతో బియ్యం అసలు ఎక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తున్నారనే అంశంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం రేషన్ బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు అధికారికంగా సరఫరా చేస్తుందా? సరఫరా చేస్తే కర్ణాటకకు వెళ్తున్నట్లు బిల్లుల్లో పేర్కొని లారీ రాజమండ్రి వైపు ఎందుకు వెళ్తోంది? లారీలో ఉన్నసీఎంఆర్ బియ్యం ఇతర మార్గాల్లో తరలిస్తున్నరా అనే ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. రాష్ట్రంలో ప్రభుత్వానికి అందించవలసిన సిఎంఆర్ బియ్యం పక్కదో పట్టడంతో ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రత్యేక బృందాలను పంపించి బిల్లులపై దాడులు చేయిస్తూ ప్రభుత్వానికి ఎగనాం పెట్టి అక్రమ మార్గంలో సిఎంఆర్ బయటికి రైస్ తరలించినట్లు గుర్తించి కేసులు నమోదు చేశారు కానీ ఇప్పుడు సీఎంఆర్ రైస్ లారీలో కర్ణాటక సరఫరా చేస్తున్నట్టు చేయడం ఉండడంతో పెద్ద ఎత్తున అనుమానాలకు తావిస్తోంది సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన లారీని పరిశీలించారు. అధికారులు బియ్యం రకం, బస్తాల గుర్తులు, బిల్లులు, రవాణా అనుమతులను పరిశీలించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.




## పోషణ అభియాన్‌ను ప్రారంభించిన కౌన్సిలర్ ముళ్ళపాటి

వైరా సెప్టెంబర్ 12 (ప్రభాతవార్త).



వైరా మున్సిపాలిటీ 13వ వార్డులోని అంగన్వాడీ కేంద్రంలో పోషణ అభియాన్ లో భాగంగా పిల్లలందరికీ పౌష్టికాహారాన్ని అందించే కార్యక్రమాన్ని ప్రారంభించిన వార్డు కౌన్సిలర్ ముళ్ళపాటి విజయలక్ష్మి.. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి మున్సిపల్ తొలి వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పౌష్టికాహారం కోసం అందించే కార్యక్రమాలను, చిన్నపిల్లల తల్లిదండ్రులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ అన్నపూర్ణ అంగన్వాడి ఆయా మరియు చిన్నారి తల్లిదండ్రులు వార్డులోని మహిళా మణులు తదితరులు పాల్గొన్నారు

## న్యూ లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ఘనంగా గణపతి ఉత్సవాలు



వైరా టౌన్ సెప్టెంబర్ 12 (ప్రభాతవార్త)

వైరా మున్సిపాలిటీ పరిధిలోని న్యూ లిటిల్ ఫ్లవర్ పాఠశాల యందు గణపతి ఉత్సవాలను పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్. పి. భుమేష్ రావు బొజ్జ గణపయ్య కు ఉండ్రాళ్ళు సమర్పించి ఉత్సవాన్ని ప్రారంభించారు. విద్యార్థులు గణపతి ఉత్సవం నందు బొజ్జ గణపయ్య వేష ధారణలో



నృత్యాలను ప్రదర్శించి, బొజ్జ గణపయ్య ను ఊరేగింపుతో గంగమ్మ ఒడికి సాగనంపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్. పి. భుమేష్ రావు మాట్లాడుతూ వినాయకుడు సకల దేవతాగణములకు అధిపతి. (గణనాయకుడు, గణపతి. గణేశుడు). అన్ని అడ్డుకులు తొలగించు వాడు (విఘ్నేశ్వరుడు) అన్ని కార్యములకూ, పూజలకూ ప్రధమముగా పూజింపవలసినవాడు. విజయానికీ, చదువులకూ, జ్ఞానానికి దిక్కైన దేవుడు. హిందూ సంప్రదాయములో శైవములోను, వైష్ణవములోను, అన్ని ప్రాంతములంలో అన్ని ఆచారములంలో వినాయకుని ప్రార్ధన, పూజ సామాన్యము. తెలుగువారి పండుగలలో వినాయకచవితి ముఖ్యమైన పండుగ, పంచాయతనపూజా విధానం లో వినాయకుని పూజకూడా ఒకటి (వినాయకుడు, శివుడు, శక్తి, విష్ణువు, సూర్యుడు వీరి పూజా సంప్రదాయాలు పంచాయతన విధానములు ప్రాణులకు హితాన్ని బోదిస్తాడు కనుక పార్వతీ పుత్రుణ్ని వినాయకుడంటారని పురాణ కథనాలు చెప్తున్నాయని, సర్వప్రకృతికి మేలు చేకూర్చే గణపతిని పూజచేసే విధానమూ విశిష్టమైందే. వినాయక చవితినుంచి తొమ్మిది రోజులపాటు కొనసాగే వినాయక పూజలో పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. గణపతి తత్వం నేటి పర్యావరణ లక్ష్యానికి దగ్గరగా ఉంటుంది. ప్రకృతికి, ప్రాణికి మధ్య ఉండాల్సిన సామరస్యాన్ని సూచిస్తుందని అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేష్ రావు, ప్రిన్సిపాల్ షాజీ మ్యాథ్యూ, నరసింహారావు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాటం ప్రపంచానికి ఆదర్శం

## సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు

సత్తుపల్లి సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

భూమికోసం భుక్తి కోసం పీడిత జన విముక్తి కోసం సాగిన విరో తెలంగాణ సాయుధ పోరాటం ప్రపంచానికే ఆదర్శమని అట్టి పోరాట స్ఫూర్తితో రానున్న కాలంలో మోడీ ప్రభుత్వాన్ని గద్దించేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణపిలుపునిచ్చారు. సత్తుపల్లి మండలం చెరుకుపల్లిలో పోడు సాగుదారుల సమావేశం తాటి వీరభద్రం అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ



ఈనెల 11వ తేదీ నుండి 17వ తేదీ వరకు సిపిఐఆధ్వర్యంలోసాయుధ పోరాట వారోత్స వాలు జరుగుతున్నాయని ఈ సందర్భంగా సాయిధ పోరాట యోధులు కొరసా జోగయ్య, కొరస పెంటమ్మ, స్థూపం వద్ద సాయిధ పోరాట వారోత్సవ కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందని దీనికి సిపిఐ జాతీయ కౌన్సిల సభ్యులు కామ్రేడ్ భాగం హేమంతరావు జిల్లా కార్యదర్శి కామ్రేడ్ దండి సురేష్ జిల్లా కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ సింగం నరసింహారావు పలువురు జిల్లా నాయకులు హాజరవుతారని దీనిని జయప్రదం చేయాలని దండు కోరారు . సిపిఐ మండల కమిటీ సభ్యులు తాటి వీరభద్రం, గడ్డం కృష్ణయ్య, తాటి రాజులు, గడ్డం రాజులు, దార బోయిన రాజు, గడ్డం తిరుపతమ్మ, తాటి రాజమ్మ, తాటి చిన్న వీరభద్రం, తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ సమావేశం

సత్తుపల్లి సెప్టెంబర్ 12 ప్రభాతవార్త



ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ సర్ కార్యక్రమంలో భాగంగా సత్తుపల్లి మున్సిపాలిటీ 3,15 వార్డ్ పరిధిలోని 187,188,189,190,191,192 పోలింగ్ కేంద్రాల్లో బిఎల్వోలు , బి ఎల్ ఏ లు అందుబాటులో ఉండి 18 సంవత్సరాలు పూర్తయిన వారికి కొత్త ఓటర్ల నమోదు ఓటరు జాబితాలో అభ్యంతరాలు, మార్పులు చేర్పులకు సంబంధించి దరఖాస్తులు శనివారం స్వీకరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో బి ఎల్ వో లు స్వాతి,పావని,శివరాం, ఆదిలక్షి ్మ, రాధా, మల్లేశ్వరి, పలు రాజకీయ పార్టీల బిఎల్ఎలుఅనిల్,చంటి,చారి సూపర్వైజర్ వెంగళరావు పాల్గొన్నారు.

## కుక్కకాటు ప్రమాదాలకు గురవుతున్నా పట్టించుకోని అధికారులు

కల్లూరు, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త



గత కొంతకాలం నుండి ఎర్రబోయినపల్లి గ్రామ వీధుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ.. ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ప్రజలు, వృద్ధులు, పిల్లలు రోడ్డుకు రావాలంటేనే భయపడుతున్న పరిస్థితి . శనివారం పాత ఎర్రబోయినపల్లి గ్రామంలో వృద్ధుడిపై కుక్కలు దాడి చేయగా అతనకు మూడు చోట్ల గాయాలు కావడం జరిగింది. కుక్క కాటుతో ప్రాణహాని కాకముందే ఇకనైనా అధికారులు త్వరగా కుక్కలు బెడద నుంచి విముక్తి కలిగించాలని ప్రజలు కోరుతున్నారు.

## మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

పెనుబల్లి, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త



లక్ష ్య టాలెంట్ స్కూల్ ఆధ్వర్యంలో వరుసగా 13 సంవత్సరాల నుండి మట్టి గణపతి విగ్రహాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఈ సంవత్సరం 300 మట్టి గణపతి విగ్రహాల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమానికి సిఐ ముత్తులింగం గౌడ్, మండల తహసిల్దార్ వీరభద్రు నాయక్, ముఖ్యఅతిదులుగా హాజరయ్యారు. ప్రిన్సిపాల్ ఈశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

రుద్రంపూర్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:



చుంచుపల్లి మండలం రుద్రంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు అభిలాష, స్వరాజ్, యశ్విక్, హస్విత్ సాయి రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని పాఠశాల ఫిజికల్ డైరెక్టరెస్ శ్రీమతి కవిత మరియు కోచ్ పొన్నాల పృథ్వీరాజ్ తెలిపారు. సెయింట్ జేవియర్స్ హైస్కూల్‌లో నిర్వహించిన సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ ఎంపిక ట్రయల్స్‌లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. వారి అద్భుతమైన ఆటతీరును పరిగణనలోకి తీసుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. 11వ రాష్ట్ర సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలు సెప్టెంబర్ 11 నుంచి 13వ తేదీ వరకు మంచిర్యాల జిల్లాలో జరుగుతున్నాయి. ఈ పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన 11 జట్లు పాల్గొంటున్నాయి. విద్యార్థుల ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. బాలాజీ, రుద్రంపూర్ సర్పంచ్ కేస్లీ, వైస్ సర్పంచ్ తోట రాజు, పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు రజాక్, మదర్ థెరిసా ట్రస్ట్ వ్యవస్థాపకులు యాకయ్య, పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

## కొత్తగూడెం సత్తుపల్లి వర్క్ పీపుల్ స్పోర్ట్స్ ప్రారంభించిన ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్

సత్తుపల్లి సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

సింగరేణి సంస్థ సౌజన్యంతో సత్తుపల్లి, కొత్తగూడెంలో శనివారంనిర్వహించినవర్క్ పీపుల్ స్పోర్ట్స్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల ప్రారంభోత్సవ కార్యక్రమంలో సత్తుపల్లి ఏరియా ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్కోటేశ్వరరావు పాల్గొన్నారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్సరికొండవెంకటాచారి, కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ వెంకటరమణ పాల్గొన్న సమావేశంలో ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు హాజరై మాట్లాడుతూ, కొత్తగా ఏర్పడిన సత్తుపల్లి ఏరియాలో కూడ వర్క్ పీపుల్ స్పోర్ట్స్ గేమ్స్ అసోసియేషన్ క్రీడలను నిర్వహించాలని కోరారు. ప్రస్తుతం సత్తుపల్లి ఏరియా నుంచి క్రీడాకారులు కొత్తగూడెం వరకు ప్రయాణించి క్రీడల్లో




పాల్గొనాల్సి వస్తుండటంతో వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అందువల్ల సత్తుపల్లి ఏరియాలోనే ప్రత్యేకంగా ఈ క్రీడలు నిర్వహించడంతో పాటు, ఏరియా స్థాయిలో ప్రత్యేక క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే కొత్తగూడెంలో జరుగుతున్న క్రీడల్లో పాల్గొంటున్న సత్తుపల్లి ఏరియా క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారి రిలీవింగ్ లెటర్లను వెంటనే మెయిల్ ద్వారా సంబంధిత అధికారులకు పంపించాలని ఆయనవిజ్ఞప్తిచేశారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సత్తుపల్లి ఏరియాలో క్రీడలకు అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని, కొత్తగా ఏర్పడిన ఏరియాకు అనుగుణంగా ప్రత్యేక క్రీడా కార్యక్రమాలనునిర్వహించాలని కోటేశ్వరరావు కోరారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ మేనేజర్ తిరుపతి, ఎస్‌వోటు జీఎం గోవిందరావు, కొత్తగూడెం ఏరియా ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ రజాక్, సత్తుపల్లి ఏరియా ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీలు సముద్రాల సుధాకర్, గట్టయ్య, స్పోర్ట్స్ కెప్టెన్లు ప్రేమ్ కుమార్, రత్నా, జేవీఆర్ ఫిట్ సెక్రటరీ సీతారామరాజు, ఇక్బాల్, అప్సర్ పాషా, దీపక్, కుమార్, నవీన్, గణేష్, తిరుపతి, శ్రీధర్, యాకుబ్, నజార్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.




## కల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ లోక్ అదాలత్

కల్లూరు, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త

కల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యక్రమంలో భాగంగా పలు రకాల కేసులు 165 కేసులను పరిష్కరించినట్లు ఎస్సై హరిత తెలిపారు కల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న వివాద స్పద కేసులు 17 కాగా మద్యాన్ని సేవించి వాహనాన్ని నడుపుతున్న 133 మంది చిన్నపాటి కేసులు 50 మొత్తం 165 మంది తో ఇరువురి మధ్య అవగాహన కల్పించి పలు రకాల కేసులపై కౌన్సిలింగ్ ఇచ్చి రాజీ పెట్టినట్లు పేర్కొన్నారు సమాజంలో ప్రజలందరూ ఐక్యమత్యంతో జీవిస్తూ ఉండాలని అప్పుడే జీవనం సంతోషంగా కొనసాగుతూ ఉంటూ ఉంటుందని ఎస్ఐ పేర్కొన్నారు. ఒకరినొకరు అర్థం చేసుకొని స్నేహభావంతో మెలగాలని కేసుల వరకు రావద్దని అవగాహన కల్పించారు.

## 16 నుంచి మున్సిపాలిటీ కార్మికుల నిరవధిక సమ్మె

కల్లూరు, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త

16వ తేదీ కల్లూరు మున్సిపాలిటీ కార్మికుల నిరవధిక సమ్మెకు సిద్ధమైనట్లు మున్సిపాలిటీ కార్మికులు సంఘం ఏఐటీయూసీజిల్లా ఉపాధ్యక్షులు ఊడల కృష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ కార్యాలయం ముందు కార్మికులు శనివారం నిరసన కార్యక్రమం తెలిపి ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేము రాంబాబు మాట్లాడుతూ మున్సిపాలిటీ కార్మికులకు గత తొమ్మిది నెలలుగా పెండింగ్ వేతనాలు ఉన్న పాలకవర్గానికి మున్సిపాలిటీ అధికారులకు స్పందన లేదని కనుక 16 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తున్నట్లు ఆయన తెలిపారు .16వ తేదీ బుధవారం నుంచి పూర్తిస్థాయిలో విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొంటున్నట్లు వారి పేర్కొన్నారు .వేతనాలు లేక కుటుంబాలు అప్పుల పాలై జీవనం ఇబ్బందికరంగా మారిందని ప్రైవేటు వ్యక్తుల వద్దఅప్పులు తెచ్చుకొని జీవనం కొనసాగిస్తున్నామని 9 నెలలైనా పాలకవర్గానికి ప్రభుత్వాధికారులకు స్పందన లేకుండా నిరక్ష ్యంగా కార్మికుల పట్ల వ్యవహరిస్తున్నారని కార్మికుల కష్టాలు పట్టించుకోకుండా పట్టి పట్టనట్లు ఉన్నారని పేర్కొన్నారు. కార్మికులకు ఒక్కొక్కరికి లక్షన్నరపైగా రావాల్సి ఉండగా జీవనం ఇరుగుపొరుగు వారిపై ఆధారపడిందని మావేతన వెతలు మా గోడు ఎవరికి చెప్పుకోలేక పోతున్నారని ఆయన వివరించారు. నిరక్ష ్యం ధోరణిలో ఉన్న పాలకవర్గం మున్సిపాలిటీ అధికారులు తోపాటు ప్రజాప్రతినిధులు పట్టించుకోని మా కుటుంబాలను ఆదుకోవాలని అంటూ వారికి మొరపెట్టుకుంటున్నారు. జీతమా జీవితమా ఇదేమి వేదన అంటూ ఒకరినొకరు ప్రశ్నించుకుంటున్నారు. మున్సిపాలిటీ ప్రజలు కార్మికులకు మద్దతునిచ్చి సంఘీభావంతో ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సిపిఐ మండలకన్వీనర్ కొత్తపల్లి వెంకటనారాయణ జిల్లా మున్సిపాలిటీ కార్మిక సంఘం కార్యదర్శి వజేర్మియా మున్సిపాలిటీ సోషల్ మీడియా అధ్యక్షులు మణి రాజు ,జరిపోతుల మంగమ్మ, ఖమ్మంపాటి రాణి ,ఉబ్బన మురళి, నరసింహారావు, సుధాకర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



# రాజీవ్‌లింక్ "ప్రాథమిక ఇసి అనుమతుల్లో" భాగమేనా !?

**మెయిన్ "డిస్ట్రిబ్యూషన్ హబ్" ఎక్కడిదాకా**

**పంప్‌హౌసెస్ ప్రమాణమా లేక కాలువల చివరిదాకానా**

**లైన్డ్ కెనాల్స్ అంటే అర్థమేమిటి**

**తొలి అనుమతుల్లోని 114 కిలోమీటర్ల నిడివి పూర్తయ్యేదెక్కడ**

**డ్యామేజ్‌పై సిడబ్ల్యుసి కి నివేదించారా**

**అది "మ్యాండేటరీ" కదా**

**ఇరిగేషన్ మంత్రి ఆదేశాల ఆంతర్యమేమి**

**పర్మిషన్ల కోసం సిసి శ్రీనివాసరెడ్డి అలుపెరుగక శ్రమించారు**

**పాలేరు దాకా క్లియరెన్స్‌లు వచ్చినట్లేనా**

**ఇంజనీర్లు ఉన్నాయనే అంటున్నారు**

**ప్రజల సందేహాలు నివృత్తి కావాలి**





అశ్వారావుపేట/జూలూరుపాడు/ప్రభాతవార్త

సీతారామాలిఫ్ట్ ఇరిగేషన్ మెగా ప్రాజెక్ట్ నిర్మాణానికి కేంద్ర పర్యావరణ అటవీ క్లైమేట్ విభాగం వారిచ్చిన అనుమతుల్లో "రాజీవ్‌లింక్ కెనాల్" కూడా భాగమేనా అనే సందేహానికి నీటిపారుదల విభాగం తక్షణం స్పందించాలి. మేము ఈ పదాన్ని వాడామంటే ఇక్కడ ఇసి క్లియరెన్స్ లేదని అనడంలేదు. అదసలు మా ఉద్దేశ్యమే కాదు. కాకపోతే మొదటి నుంచీ అంటే 07.01.2019 తేదీన ఇసి ప్రైమరీ క్లియరెన్స్ జారీ చేసిన నాటినుంచీ ఈరోజు దాకా.,అందుబాటులో ఉన్న డాక్యుమెంట్ల ఆధారంగా అధ్యయనం చేసినప్పుడు కొన్ని అనుమానాలు సహజంగానే కలుగుతున్నాయి. అవేమిటో ఒక్కసారి విశ్లేషిద్దాం.

**మెయిన్ డిస్ట్రిబ్యూషన్ హబ్ ఎక్కడిదాకా**

బృహత్తర సీతారామా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ నిర్మాణానికి "ఎన్ఓ జె.12011/16/2017..ఐఎ..1(ఆర్)కేంద్ర పర్యావరణ అటవీ క్లైమేట్ డివిజన్" వారు 07.01.2019 ద్వారా ప్రాథమిక అనుమతులిచ్చారు. దీన్లో చెబుతున్నదేమంటే.,114.50కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్ కి "ప్రైమరీ గ్రాంటెడ్" అన్నారు. అంతే కాకుండా ఇంచుమించు 372 కిలోమీటర్ల "లెయింగ్ కెనాల్" అనీ ప్రత్యేకంగా పొందుపరిచారు. లెయింగ్ అంటే కాలువ రెండు వైపులా అంచులు..అలానే కింది భాగంలో బెడ్ ఏరియా ఇలా మూడు కొలతలను కలిపితే ఇసి అనుమతించిన 114.50 కిలోమీటర్ల నిడివికి సరిగ్గా సరిపోతున్నది. దీన్నిబట్టి పరిశీలిస్తే ప్రాథమిక ఇసి లో సీతారామాలిఫ్ట్ కోసం ఆ 114.50 కిలోమీటర్ల పొడవు వరకే కాలువల తవ్వకాలకు తొలి విడత అనుమతి ఇచ్చారనే అనుకోవాల్సి వస్తుంది. ఐతే దుమ్ముగూడెం అనికట్ మొదలుకుని తొలి పంప్‌హౌస్ బిజి కొత్తూరు నుంచి వికె రామవరం, కమలాపురం, గండుగులపల్లి పంపింగ్ పాయింట్స్ దాకా ఈ 114 కిలోమీటర్ల నిడివి వచ్చిందా లేక ఇది వైరా పాలేరు దాకా వెళుతుందా అనేది 07.01.2029 తేదీ నాటి కేంద్ర ఇసి లో విడమరచి చెప్పలేదు. 372 కిలోమీటర్ల ఆదేశిత నిర్ణీత ప్రాంతానికి (సప్లయ్‌వాటర్ టు ది డిజిగ్నేడెట్ కమాండ్ ఏరియా) అని ఓ మాట చెప్పారు. మరి లెయింగ్ కెనాల్ అన్నప్పుడు 114 కిలోమీటర్ల కాలువల మూడు కొలతల్నీ కలిపి చూడాలి కదా. సరే దీన్ని కాసేపు అలా ఉంచితే.,ఈ 114.50 కిలోమీటర్ల అనుమతింపబడిన కాలువకి మరో నిర్వచనం సూచించారు. "రన్నింగ్ ఫ్రం ది హెడ్‌వర్క్స్ ఆర్ అప్రోచ్ ఛానల్ డౌన్ త్రో ది మెయిన్ డిస్ట్రిబ్యూషన్ హబ్స్" అని పొందుపరిచారు. డిస్ట్రిబ్యూషన్ హబ్స్ దాకా 114 కిలోమీటర్ల నిడివి అనేది దీని అర్థం. ఆ హబ్స్ ఎక్కడిదాకానో స్పష్టం చేయట్లేదు. పంప్‌హౌస్ దాకానా లేక 7లక్షల ఎకరాలకు పైగా నీరందిచబడే చివరి భూముల దాకానా అనేది సందిగ్ధమే. ఈ ప్రస్తావన ఎందుకు తేవాల్సి వచ్చిందంటే.,ఏదైతే ఇసి 114 కిలోమీటర్ల పొడవునా కాలువల తవ్వకాలకు ప్రాథమిక అనుమతి ఇచ్చిందో.,వైరాకి కొత్తగా తవ్విన రాజీవ్‌లింక్ కెనాల్స్ భూభాగం కూడా ఆ ప్రైమరీ అప్రూవల్లో భాగమేనా కాదా అని తెలుసుకోవడానికి మాత్రమే. బహుశా ఈ పర్మిషన్స్ పంపింగ్ పాయింట్స్ దాకా మాత్రమే అయి ఉంటే.,డిస్ట్రిబ్యూటరీ సిస్టం చిక్కుల్లో పడ్డట్లే అనుకోవాలి. నిజానికి ఈ ఎత్తిపోతల విషయంలో ఇప్పటిదాకా 2019 లో ఒకసారి మాత్రమే ఇసి జారీ అయినట్లు తెలుస్తుండగా., డిస్ట్రిబ్యూటరీ కోసం లేదా పిల్లకాలువల అవసరాలకు రెండవవ విడత క్లియరెన్స్ ఎప్పుడు ఇచ్చారో సంబంధిత ఇంజనీర్లు చెబితే తప్ప బయటకు తెలిసే అవకాశం లేదు. ఇప్పటిదాకా అందుబాటులో ఉన్న రికార్డు ప్రకారం ఆ 114.50 కిలోమీర్లు అలానే 372 కిలోమీటర్ల లెయింగ్ అని మాత్రమే ఉన్నది. రాజీవ్‌లింక్ ఇందులోదేనా కాదా అనేది మాత్రం సందిగ్ధం. తొలి 2019 నాటి అనుమతుల తోనే మొత్తం కథ నడిపేయాలని ఏమైనా ఇంజనీరింగ్ విభాగం ఏదోఒక వెసులుబాటు చూసుకుంటున్నదేమో అదీ తెలియదు. అన్నట్లు చెప్పడం మరిచాం.,

ఈ ఏడాది జూన్ రెండవ వారంలో ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్ హైద్రాబాద్ జల్‌సౌధాలో ఏర్పాటుచేసిన సమీక్షలో "సీతారామాలిఫ్ట్" కి సంబంధించిన పెండింగ్ ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్‌లన్నీ యుద్ధప్రాతిపదికన సమీకరించాలని ఆదేశించారు. అంటే 2019 నాటి ప్రాథమిక అప్రూవల్స్ కాకుండా ఇంకా కొన్ని అవసరాలున్నాయనేది ఆయన మాటల్నిబట్టి అర్థమవుతుంది. అవి ఏమిటి.. రాజీవ్‌లింక్ కూడా ఇందులో ఉన్నదా ఏమిటి.,అన్న బలమైన సందేహం కలుగుతున్నది.

ఆయనైతే విడమరచి మాత్రం చెప్పలేదు కాబట్టి కేవలం ఇది సందేహం మాత్రమే. ఇదిలా ఉంటే ఛీఫ్ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి మాత్రం ఢిల్లీలో మకాం పెట్టి ఈ ఎత్తిపోతల కు అవసరమైన సమస్త అనుమతులనూ సాధించేందుకు శక్తివంచన లేకుండా శ్రమించిన విషయం మరచిపోరాదు. మరి అందులో ఈ రాజీవ్‌లింక్ కెనాల్ పర్మిషన్స్ కూడా ఉండే ఉండాలి. ఏదైనా ఇరిగేషన్ వారే ఈ సందేహాలనుంచి విముక్తి కలిగించాలి.

# సమ్మె నోటీసు నుంచి అగ్రిమెంట్ల వరకు.. ఏఐటీయూసీ విజయఢంకా



**కార్మికుల హక్కుల కోసం పోరాడి.. అగ్రిమెంట్లు సాధించాం**

కొత్తగూడెం టౌన్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:

సింగరేణి కార్మికుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రత కోసం ఏఐటీయూసీ సాగిస్తున్న పోరాటాలకు కార్మికుల నుంచి విశేష మద్దతు లభిస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్,అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య అన్నారు. కొత్తగూడెం, కార్పొరేట్, సత్తుపల్లి ఏరియాల సంయుక్త ఆధ్వర్యంలో శేషగిరిభవన్‌లో జనరల్ బాడీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించబడింది. జూన్ 8న ఏఐటీయూసీ ఇచ్చిన సమ్మె నోటీసు నేపథ్యంలో ఆర్ఎల్‌సీ సమక్షంలో సింగరేణి యాజమాన్యంతో నిర్వహించిన వరుస చర్చల ద్వారా 23 కీలక డిమాండ్లపై అగ్రిమెంట్లు సాధించామని సీతారామయ్య, రాజ్ కుమార్,మిరియాల రంగయ్య తెలిపారు. పెర్క్స్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్ యాజమాన్యం భరించడం, సర్వీసులో సహజ మరణం పొందిన కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం, ప్రతి నెల మెడికల్ బోర్డు నిర్వహణ, 2025-26 వాస్తవ లాభాలను దసరాలోపు ప్రకటించేందుకు చర్యలు, బదిలీల్లో మూడేళ్ల నిబంధనకు బదులుగా ఖాళీల ఆధారంగా ఏడాది నిబంధన అమలు, అర్హులైన మైనింగ్ స్టాఫ్‌కు ఓవరన్ ప్రమోషన్లు వంటి పలు అంశాల్లో యాజమాన్యం అంగీకరించిందన్నారు.

కార్మికుల వైద్య అవసరాల కోసం హైదరాబాద్‌లో సింగరేణి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు, మెడికల్ అటెండెన్స్ నిబంధనల సవరణ, సర్వీసు నుంచి దిగిపోయిన కార్మికులకు ఓపీతో పాటు వారం రోజుల వరకు వైద్య సేవలు, సింగరేణి విద్యాసంస్థల్లో సీబీఎస్ఈ సిలబస్ అమలు, గనుల్లో సేఫ్టీ మెటీరియల్ సకాలంలో అందుబాటులో ఉంచడం వంటి అంశాలపై కూడా అంగీకారం సాధించామని వివరించారు. అగ్రిమెంట్లు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో అమలయ్యే వరకు ఏఐటీయూసీ పర్యవేక్షణ కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్మికులకు రావాల్సిన ప్రతి హక్కు, ప్రతి ప్రయోజనం అందే వరకు రాజీలేని పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, బ్రాంచ్ కార్యదర్శులు రమణమూర్తి, జక్కుల గట్టయ్య, సముద్రాల సుధాకర్, ఉపాధ్యక్షులు క్రిస్టోఫర్, కత్తెర్ల రాములు, భీమయ్య, సహాయ కార్యదర్శులు రాము, సూర్యప్రకాశ్, కాంట్రాక్ట్ వర్కర్స్ ఇన్‌చార్జి ఎర్రగాని కృష్ణయ్య, ఆఫీస్ బేరర్లు, అన్ని గనులు, డిపార్ట్‌మెంట్ల పిట్ సెక్రటరీలు, వివిధ కమిటీల నాయకులు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్‌లో 583 కేసులు పరిష్కారం



**రాజీ పడితే ఇరు వర్గాలు గెలిచినట్లే**

**జడ్జి స్వరూప కాటం**

ఇల్లందు, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:

ఇల్లందు కోర్టు ఆవరణలో ఇల్లందు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. కార్యక్రమానికి జడ్జి స్వరూప కాటం హాజరై లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కక్షిదారులు పంతాలకు పోకుండా రాజీ పడదగిన కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవడం ద్వారా విలువైన సమయం, డబ్బు ఆదా చేసుకోవచ్చని తెలిపారు లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన పోలీస్ కేసులు, గృహహింస కేసులు, మనోవర్తి కేసులు, చెక్ బౌన్స్ కేసులు, సివిల్ దావాలు తదితర కేసులను ఇరు వర్గాల అంగీకారంతో పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. కక్షిదారులు పంతాలకు పోకుండా పరస్పరం చర్చించుకుని రాజీకి రావడం ద్వారా కోర్టుల చుట్టూ తిరిగే సమయం, న్యాయపరమైన ఖర్చులను తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో పరస్పర అంగీకారంతో ఒకసారి కేసు పరిష్కరించుకున్న తర్వాత సాధారణంగా దానిపై అప్పీల్‌కు అవకాశం ఉండదని తెలిపారు. ఇరు వర్గాలు పరస్పర సమ్మతితో సమస్యను పరిష్కరించుకోవడం వల్ల ఎవరు ఓడినట్లు కాకుండా ఇరు వర్గాలు గెలిచినట్లేనని అన్నారు. కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 583 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. లోక్ అదాలత్‌కు హాజరైన కక్షిదారులకు ఇల్లందు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జడ్జి స్వరూప కాటం చేతుల మీదుగా అరటి పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఇల్లందు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్.కే.ఎం.డి. కాసిం, సీనియర్ న్యాయవాదులు బాలకృష్ణ, దంతాల ఆనంద్, పప్పుల గోపీనాథ్, జూనియర్ న్యాయవాదులు కీర్తి కార్తిక్, మామిడి సత్య ప్రకాష్, పైల జయప్రకాష్, కే. ఉమామహేశ్వరరావు, ఎస్. సత్యనారాయణ దొర, ఎస్. బన్సీలాల్, కోర్టు సూపరింటెండెంట్ శ్రీరంగం రామకృష్ణ, పోలీస్, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నన్ను పూజించండి..ప్రకృతిని కాపాడండి

**ఆర్భాటం వద్దు.. ఆరాధనే ముద్దు.**

**మట్టి విగ్రహాలతోనే..పర్యావరణ హితం.**

**కాలుష్యంపై గణపయ్య ఆవేదన.**

**.భక్తి పేరుతో ప్రకృతి హాని వద్దు.**

ఏన్కూరు, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త :వినాయక చవితి పండుగకు రెండు రోజులే మిగిలాయి. గణనాథుడి ప్రతిమల తయారీ..మండపాల ఏర్పాటు..ఉత్సవాల నిర్వహణకు భక్తులు సిద్ధమవుతున్నారు. వీధివీధినా వినాయకుడి ప్రతిమలు కొలువుదీరనున్నాయి. భక్తి శ్రద్ధలతో మూడు నుంచి పదకొండు రోజుల పాటు పూజలు అందుకోనున్న గణనాథుడిని అనంతరం నిమజ్జనం చేయనున్నారు. అయితే భక్తుల ఆదరణతో ఒకవైపు సంతోషిస్తూనే..పర్యావరణానికి జరుగుతున్న నష్టంపై గణపయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లుగా ఈ కథనం చెబుతోంది..మట్టితో చేసిన విగ్రహమే ముద్దు..మానవులారా..నాకు ఊహ తెలిసినప్పటి నుంచి మీ తొలి పూజలు అందుకుంటున్నాను. నా ఉత్సవాలను నిర్వహించుకొని వీధివీధినా నన్ను ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజించడం చూస్తుంటే ఆనందంగా ఉంటుంది. అయితే కాలం మారుతున్న కొద్దీ మీ భక్తుల్లోనూ మార్పులు వచ్చాయి. భక్తి పేరుతో ప్రకృతికి హాని చేసే పద్ధతులు పెరగడం బాధ కలిగిస్తోంది. గతంలో చెరువు మట్టి..సహజ పదార్థాలతో నా ప్రతిమలను తయారు చేసి ఆకులు..పుష్పాలు..ఫలాల తో పూజించేవారు. ఇప్పుడు రంగురంగుల హంగులతో భారీ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా ప్లాస్టర్ఆఫ్ పారిస్..రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాల నిమజ్జనం జలవనరులపై ప్రభావం చూపుతోంది. నీటిలో కలిసే పదార్థాలు జలచరాలకు ఇబ్బందులు కలిగించే అవకాశం ఉంది. నన్ను పూజించే మీ భక్తి..మరో జీవరాశికి హాని కలిగించేలా ఉండకూడదన్నదే గణనాథుడి సందేశం..నా నిమజ్జనం..జీవరాశులకు మృత్యు దినం కావాలా? నిమజ్జనం అనంతరం చెరువులు..కుంటలు.. ఇతర జలవనరుల్లో పేరుకుపోయే వ్యర్థాలు నీటి నాణ్యతను దెబ్బ తీస్తాయి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు..రసాయన రంగులు..నీటిలో కలవడంతో జలచరాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. పశుపక్షాదులు కలుషిత నీటిని తాగడం..చేపలు మృత్యువాత పడటం వంటి పరిణామాలు చోటుచేసుకునే ప్రమాదం ఉంది. నా జన్మదినం జీవరాశులకు మృత్యు దినం కావాలా? అని గణపయ్య ప్రశ్నిస్తున్నట్లుగా ఈ పరిస్థితి మనకు గుర్తుచేస్తోంది. జలవనరులను కలుషితం చేసి చివరకు మానవ మనుగడకే ముప్పు తెచ్చుకోవద్దు. పండుగలు ఆనందాన్ని పంచాలి..అనారోగ్యాన్ని కాదు..భక్తి ప్రకృతిని



కాపాడే విధంగా ఉండాలి..ప్రమాదకరంగా మారకూడదన్నదే గణనాథుడి సందేశం..ప్లాస్టిక్‌కు దూరంగా.. ప్రకృతికి చేరువగా..వినాయక ఉత్సవాల్లో ప్లాస్టిక్ వినియోగం కూడా పెరుగుతోంది. పూలు..పూజా సామగ్రి..ప్రసాదాల పంపిణీ..అలంకరణల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరం ఉంది. వస్త్ర సంచులు..ఆకుదొన్నెలు..పర్యావరణహిత వస్తువులను వినియోగించడం ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించవచ్చు. అడవిలో పుట్టిన ఆకులు..సహజ సిద్ధమైన పూలంటే నాకు ఎంతో ఇష్టం. ప్రకృతిని ప్రేమిస్తూ నన్ను పూజించండి. భక్తి ప్రయోజనకరంగా ఉండాలి..ప్రమాదకరంగా మాత్రం మారకూడదన్నదే గణనాథుడి సందేశం.. ఉత్సవాల్లో క్రమశిక్షణ అవసరం..వినాయక ఉత్సవాల సందర్భంగా మండపాలను రహదారులకు అడ్డంగా ఏర్పాటు చేయడం. అధిక శబ్దంతో డీజేలు నిర్వహించడం..మద్యం సేవించి నృత్యాలు చేయడం..ఇతరులకు ఇబ్బందులు కలిగించడం వంటి చర్యలు ఉత్సవాల పవిత్రతను దెబ్బతీస్తాయి. పోలీసుల సూచనలు.. నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాల్సిన అవసరం ఉంది..అలాగే చిన్నచిన్న విభేదాలను వివాదాలుగా మార్చకుండా..రూపాలు వేరైనా దైవం ఒకటే అనే భావనతో ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి. భక్తి..ఆనందం..సామాజిక బాధ్యత కలగలిపినప్పుడే వినాయక ఉత్సవాలకు నిజమైన అర్థం చేకూరుతుంది. యువతదే కీలక పాత్ర..వినాయక ఉత్సవాల్లో యువత పెద్దఎత్తున పాల్గొంటున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణలోనూ వారు ముందుండాలి. భారీ విగ్రహాల కంటే మట్టి విగ్రహాలకు ప్రాధాన్యం ఇవ్వడం..ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించడం..నిమజ్జనం అనంతరం పరిసరాలను శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలను చేపడితే సమాజానికి ఆదర్శంగా నిలవొచ్చు. మండపాల వద్ద మొక్కల పంపిణీ..రక్తదాన శిబిరాలు..పారిశుద్ధ్య కార్యక్రమాలు..పర్యావరణంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఉత్సవాలను సామాజిక సేవతో ముడిపెట్టవచ్చు. భక్తి అంటే కేవలం పూజలు చేయడం మాత్రమే కాదని..సమాజానికి..ప్రకృతికి మేలు చేయడమూ భక్తిలో భాగమేనని చాటిచెప్పాల్సిన అవసరం ఉంది. నిమజ్జనం కూడా పర్యావరణహితంగా..విగ్రహాల నిమజ్జన సమయంలో జలవనరులు కలుషితం కాకుండా అధికారులు సూచించే ప్రాంతాల్లోనే నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించాలి. సాధ్యమైన చోట్ల కృత్రిమ నిమజ్జన కొలనులను వినియోగించడం ద్వారా చెరువులు..కుంటలపై ఒత్తిడిని తగ్గించవచ్చు. నిమజ్జనం అనంతరం విగ్రహాల అవశేషాలు..పూజా సామగ్రి..పూలు..ఇతర వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత. మళ్లీ మట్టివైపు అడుగులు..పర్యావరణహితమైన మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించడం..సహజ రంగులను వినియోగించడం, ప్లాస్టిక్‌కు దూరంగా ఉండటం..జలవనరులను కలుషితం చేయకుండా నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా గణనాథుడికి నిజమైన పూజ చేసినట్లవుతుంది."నన్ను ఘనంగా పూజించడం మాత్రమే కాదు..నేను కొలువుదీరే ప్రకృతిని కూడా కాపాడండి..నా ఉత్సవాలు భక్తికి ప్రతీకగా నిలవాలి..కాలుష్యానికి కారణం కాకూడదు"అన్నదే గణపయ్య కోరుతున్న సేవ..మట్టి వినాయకుడిని పూజిద్దాం..మన చెరువులను కాపాడుదాం.. ప్రకృతిని పరిరక్షిద్దాం. భక్తితో పండుగ చేసుకుందాం..బాధ్యతతో భవిష్యత్తును కాపాడుకుందాం.

## పేద ప్రజల గుండెల్లో కళాసాగర్

చింతకాని, ప్రభాత వార్త సెప్టెంబర్ 12



పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే వ్యక్తి అలవాల కళాసాగరేనని కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇనుకుల్లా సూరారెడ్డి తెలిపారు. పందిళ్ళపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు అలవాల జనార్దన్ రావు కుమారుడు ఎన్నారై కళాసాగర్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు గ్రామ ప్రజల సమక్షంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు కాంగ్రెస్ నాయకులు ఇనుకుళ్ళ నాగసూరారెడ్డి మాట్లాడుతూ అమెరికాలో ఉంటూ గ్రామ ప్రజలకు తన వంతు సహాయం చేస్తున్న కళాసాగర్ సేవలు మరువలేనివి, గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్న కళాసాగర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు , గ్రామ పెద్దలు, ప్రజలు వీడియో కాల్ ద్వారా కళాసాగర్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చింతకాని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు లింగం రాంబాబు మాట్లాడుతూ గ్రామంలో పేద బడుగు బలహీన వర్గాలకు అలవాల జనార్దన్ దంపతులు ఎంతగానో సహాయ సహకారాలు అందించారని కొనియాడారు. ఆపదలో ఉన్న వారిని నేనున్నానంటూ ఆదుకుంటున్న అలవాల జనార్ధన్ రావు కుమారుడు కళాసాగరకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

## లచ్చగూడెంలో నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు కలెక్టర్ పరిశీలన



చింతకానీ ప్రభాత వార్త సెప్టెంబర్ 12

మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామంలో నూతనంగా మంజూరైన నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ టి ఎస్ దివాకర్ శనివారం పరిశీలించారు నర్సింగ్ కళాశాల తరగతుల నిర్వహణ కోసం గ్రామంలోని మినీ స్టేడియంలో ఉన్న తరగతి గదులను ఆయన పరిశీలించారు కళాశాల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తరగతులు నిర్వహించే విధంగా అవసరమైన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు అనంతరం నర్సింగ్ కళాశాల నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని కూడా కలెక్టర్ పరిశీలించారు నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్ణీత సమయంలోగా కళాశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొప్పుల గోవిందరావు, గొడుగు రమేష్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపాల్, ఏఈ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సేవలో మట్టి గణపతి..పదేళ్ల ప్రస్థానం.

**పదేళ్లగా ఉచిత మట్టి గణపతులు.**

**పర్యావరణ పరిరక్షణకు సుజాత..రామారావు దంపతుల**

**బృహత్తర సేవ.భక్తితో పాటు..ప్రకృతి పరిరక్షణ.**

ఏన్కూరు, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త :

పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ఏన్కూరుకు చెందిన ఉపాధ్యాయ దంపతులు సుజాత..రామారావు పదేళ్లుగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమం ఆదర్శంగా నిలుస్తోంది. గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా..పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) విగ్రహాలకు బదులుగా మట్టి గణపతులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 2016 నుంచి ప్రతి ఏటా వందలాది మట్టి గణపతి విగ్రహాలను స్వయంగా తయారు చేసి ఏన్కూరు మండల ప్రజలకు ఉచితంగా అందజేస్తున్నారు. పర్యావరణహిత గణపతులే లక్ష్యం..గణేశ్ ఉత్సవాల్లో పీఓపీ విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల చెరువులు..కుంటలు..నదులు..కలుషితమవుతున్నాయి. రసాయనిక రంగులు..కరగని పదార్థాల కారణంగా జలవనరులకు నష్టం వాటిల్లుతోంది. ఈ నేపథ్యంలో ప్రకృతికి హాని కలగకుండా మట్టి గణపతులను ఉపయోగించాలని సుజాత..రామారావు దంపతులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థుల భాగస్వామ్యంతో తయారీ..ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఈ దంపతులు విద్యార్థులను కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేస్తున్నారు. ప్రతి సంవత్సరం గణేశ్ చవితికి ముందుగానే మట్టి విగ్రహాల తయారీ చేపట్టి..వాటిని ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. తద్వారా విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడంతో పాటు సేవా భావాన్ని అలవర్చుతున్నారు. నిమజ్జనంతో నీటికి హాని లేదు..మట్టి గణపతి విగ్రహాల నిమజ్జనం అనంతరం అవి సహజంగా నీటిలో కలిసిపోతాయి. దీంతో నీటి వనరులకు పెద్దగా హాని ఉండదు. పీఓపీ విగ్రహాలతో పోలిస్తే మట్టి విగ్రహాలు పర్యావరణానికి ఎంతో మేలు చేస్తాయని ప్రజలకు వివరిస్తూ..పండుగను భక్తిశ్రద్ధలతో పాటు ప్రకృతి పరిరక్షణకు అనుగుణంగా నిర్వహించాలని వారు సూచిస్తున్నారు. వేలాది మందికి స్ఫూర్తి..గత పదేళ్లుగా కొనసాగుతున్న ఈ కార్యక్రమం ద్వారా వేలాది మంది మట్టి గణపతులను వినియోగించేలా ప్రేరణ పొందారు. ముఖ్యంగా యువత..విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యం పెంపొందించడంలో ఈ కార్యక్రమం కీలకంగా



మారింది. భక్తి..సంప్రదాయాలకు ప్రాధాన్యమిస్తూనే ప్రకృతిని కాపాడుకోవచ్చని సుజాత..రామారావు దంపతులు తమ సేవ ద్వారా చాటిచెబుతున్నారు. "మట్టి గణపతిని ఆరాధిద్దాం..పర్యావరణాన్ని కాపాడుదాం." ఈ సందర్భంగా సుజాత..రామారావు దంపతులు మాట్లాడుతూ."పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత. మన పండుగలు ప్రకృతికి హాని కలిగించేలా కాకుండా..ప్రకృతిని కాపాడేలా ఉండాలి. మట్టి గణపతి విగ్రహాలను వినియోగించడం ద్వారా నీటి వనరులను సంరక్షించడంతో పాటు భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించ వచ్చు. ప్రజలందరూ పర్యావరణహిత మట్టి గణపతులను వినియోగించి గణేశ్ నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలి" అని పిలుపునిచ్చారు. పలువురి అభినందనలు. "మట్టి గణపతిని ఆరాధిద్దాం- పర్యావరణాన్ని కాపాడుదాం "అనే సందేశంతో పదేళ్లుగా స్వచ్ఛందంగా కొనసాగిస్తున్న ఈ సేవా కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు.. విద్యావేత్తలు..పర్యావరణ ప్రేమికులు అభినందనలు తెలిపారు. పండుగను పర్యావరణహితంగా నిర్వహించేందుకు సుజాత..రామారావు దంపతులు చేస్తున్న కృషి మరింత మందికి స్ఫూర్తిగా నిలుస్తోందని వారు పేర్కొన్నారు.

# ప్రజా సమస్యల పై స్పందించరా

**పడకేసిన పారిశుధ్యం**

**కార్పొరేషన్ అధికారుల పనితీరు పై**

**మండిపడ్డ మాజీ కార్పొరేటర్**

**తోట రామారావు**

ఖమ్మం అర్బన్, సెంబర్ 12(ప్రభాత వార్త)

ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 48వ డివిజన్ లో పడకేసిన పారిశుధ్యం పై, కార్పొరేషన్ అధికారుల పని తీరు పై శనివారం మాజీ కార్పొరేటర్ తోట రామారావు మరో సారి మండి పడ్డారు. 48వ డివిజన్ ప్రాంత పరిధి పెద్దదని పూర్తి స్థాయిలో సిబ్బంది లేక పారిశుద్ధం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని సిబ్బంది పెంచాలని, విపరీతంగా పెరిగిన చెట్లు,చెత్తను పరిశుభ్రం చేసే విధంగా వారంలో మూడు రోజులు జేసీబీ కేటాయించాలని అనేకమార్లు మాజీ ప్రజా ప్రతినిధిగా వినతి పత్రం ఇచ్చిన స్పందించే పరిపాలన లేదని సామాన్య మానవుని



పరిస్థితి ఏంటి అని కార్పొరేషన్ అధికారులపై మండిపడ్డారు. కార్పొరేషన్ అధికారులు స్పందించకపోయినా ఈ ప్రాంత మాజీ ప్రజా ప్రతినిధిగా వాళ్ళ సమస్యలపై స్పందించాల్సిన బాధ్యత మాపై ఉందని. ప్రజా ఆరోగ్య దృష్ట మా సొంత నిధులతో అనేకసార్లు జేసీబీ ఏర్పాటుచేసి పారిశుద్ధం పై ప్రత్యేక దృష్టిని సారించామని ప్రస్తుతం మరల సొంత నిధులతోనే జేసీబీ ఏర్పాటు చేసుకొని స్థానిక గణేష్ నగర్ ప్రాంతంలో డ్రైనేజు,విపరీతంగా పెరిగిన చెత్తాచెదారులను, వినాయక చవితి పండగను పురస్కరించుకొని గణేష్ మండపాల స్థలాలు కూడా పరిశుభ్రం చేస్తున్నట్టు తెలియజేశారు. గత వారం భగీరథ పైపులైను నిర్మాణంలో కూడా మా సొంత ట్యాంకర్ తో ప్రజలకు ఇబ్బంది లేకుండా మంచినీటి సరఫరా చేయడం జరిగిందని. ఇలా ప్రజాక్షేత్రంలో ప్రజా సమస్యలపై స్పందిస్తూ ఎప్పటికప్పుడు వారి సమస్యల పరిష్కారంలో ఉన్న సందర్భంలో అనేకసార్లు కార్పొరేషన్ అధికారులకు సిబ్బంది విషయం, జేసీబీ తదితర అవసరాల నిమిత్తం ఎన్నిసార్లు వినతిపత్రం ఇచ్చిన స్పందించకపోవడం చాలా బాధాకరమని తెలియజేస్తూ ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి ప్రజలకు అవసరమైన పారిశుద్ధం, మంచినీటిపై తగు చర్య తీసుకోవాలని స్థానిక ప్రజలతో గల మెత్తారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ బాబు, అంజయ్య, గుణ గంటి శ్రీనివాస గౌడ్, యాసారపు ఉపేందర్ , తోట రమేష్, చేతి క్రిష్ణ, రమణ, ప్రభాకర్, నవీన్,కిషన్ నాయక్, బాబా పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్ ద్వారా 10,955 కేసుల పరిష్కారం

**సైబర్ క్రైమ్ కేసుల్లో బాధితులకు రూ.27.90 లక్షలకు పైగా రిఫండ్**

**పోలీస్ కమిషనర్ సునీల్ దత్**

ఖమ్మం క్రైమ్, ప్రభాతవార్త.

జిల్లావ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించిందని, లోక్ అదాలత్ ద్వారా రాజీకి అవకాశం ఉన్న 10,955 కేసులు పరిష్కరించామని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించిన 10,955 కేసుల్లో 985 ఎఫ్ఐఆర్ కేసులు, 3301 ఈపెట్టీ కేసులు, 6621 డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసులు, 48 సైబర్ క్రైమ్ కేసులు ఉన్నాయని తెలిపారు. సైబర్ క్రైమ్ కేసుల్లో బాధితులకు మొత్తం రూ. 27,90,612/ రిఫండ్ మొత్తాన్ని అందజేసినట్లు పోలీస్ కమిషనర్ వెల్లడించారు."రాజీ మార్గం రాజ మార్గం" అనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారానికి కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు. అదేవిధంగా జాతీయ లోక్ అదాలత్ విజయవంతం కావడానికి సహకరించిన న్యాయవాదులు, కక్షి దారులు, న్యాయసేవాధికారులకు పోలీస్ కమిషనర్ కృతజ్ఞతలు తెలిపారు.

# జిల్లా వ్యాప్తంగా 5774 కేసులు పరిష్కారం

కొత్తగూడెం లీగల్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:



జాతీయ లోక్ అదాలత్ లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా 5774 కేసులు పరిష్కారం అయ్యాయి. జిల్లా వ్యాప్తంగా పరిష్కారమైన కేసుల వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తగూడెం కోర్ట్ లో ... సివిల్ కేసులు 32, 8 మోటార్ వాహన ప్రమాద కేసులల లో 37 లక్షల 50 వేలకు రూపాయ లకు పరిష్కారం అయింది. క్రిమినల్ కేసులు 2391 కేసులు, పిఎల్ సి కేసులు : బ్యాంకు:193, టెలిఫోన్ :9, సైబర్ క్రైమ్ కేసులు: 57, ట్రాఫిక్ చల్లన్ : 702 కలిపి మొత్తం పరిష్కారమైన కేసులు : 3384. ఇల్లందు కోర్ట్ లో సివిల్ కేసులు 11, క్రిమినల్ కేసులు 347, బ్యాంకు, ప్రామిసరి నోట్ కేసులు 169, ట్రాఫిక్ చలాన్ :75 కలిపి మొత్తం పరిష్కారమైన కేసులు : 602 పరిస్కారం అయ్యాయి. భద్రాచలం కోర్టులో... క్రిమినల్ కేసులు 1057, బ్యాంకు, పి ఎల్ సి కేసులు 27, ట్రాఫిక్ చలాన్ :37, మొత్తం పరిష్కారమైన కేసులు : 1121, మణుగూరు కోర్ట్ లో క్రిమినల్ కేసులు 338, బ్యాంకు పిఎల్సి : 32, ట్రాఫిక్ చలాన్ :52 మొత్తం పరిష్కారమైన కేసులు : 422, దమ్మపేట కోర్ట్ లో క్రిమినల్ కేసులు : 168, సివిల్ : 2, బ్యాంకు పిఎల్సి: 38, ట్రాఫిక్ చలాన్ : 37, మొత్తం :245 కేసులు పరిస్కారం అయ్యాయి.

# రైస్ మిల్లుల సమస్యలను పరిష్కరించండి

**రైస్ మిల్లుల అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కు వినతి**

కొత్తగూడెం, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:

ధాన్యం మిల్లింగ్ నిలిపివేత , బిల్లింగ్ సమయం లో ఏర్పడిన తరుగు మరియు ఎఫ్ సి ఐ ద్వారా బాయిల్డ్ రైస్ స్వీకరణకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి సానుకూల నిర్ణయం తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ కు వినతి పత్రం అందజేశారు. ఈ విషయాలకు సంబంధించి 7 9 2026 తేదీన జరిగిన రాష్ట్ర రైస్ మిల్లర్ల ప్రెస్ మీట్ లో తీసుకున్న నిర్ణయం మేరకు , భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని రైస్ మిల్లులు నేటి నుండి మిల్లింగ్ కార్యక్రమాలు నిలిపివేయాలని నిర్ణయించుకున్నామని, బిల్లింగ్ ప్రక్రియలో ట్రాన్స్పోర్ట్ , నూకలు , పరమ ఇతర తరుగుదలలు కలిపి సుమారు 15!! నుండి 20!! వరకు తరుగు వస్తుందని , ఈ తరుగుదలను ఫిజికల్ వెరిఫికేషన్ సమయంలో సరైన విధంగా తీసుకోకపోవడం వల్ల రైస్ మిల్లర్స్ కు తీవ్ర ఆర్థిక నష్టం కలుగుతుందని , ఈ కారణంగా ప్రస్తుతం మిల్లింగ్ ప్రక్రియ కొనసాగించడం ఆర్థికంగా సాధ్యం కానీ పరిస్థితి ఏర్పడిందని, పై సమస్యలకు తగిన పరిష్కారం లభించే వరకు మిల్లింగ్ కార్యక్రమాలు నిలిపివేయాలని జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ నిర్ణయించుకున్నదని చెప్పారు. అధ్యక్షుడు జుగల్ కిషోర్ ఖండేల్వాల్, సెక్రటరీ శ్రీనివాస రెడ్డి, ట్రెజరర్ పల్లపోతు శ్రీనివాసు, వెంకటేశ్వర రెడ్డి, కంచర్ల శ్రీనివాసు, జిల్లా రైస్ మిల్లు ప్రతినిధులు పాల్గొన్నారు.

# సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు చేపట్టాలి

**భాగం హేమంతరావు**

చింతకాని,ప్రభాతవార్త



నైజాం నిరంకుశ పాలన అంతం కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రభుత్వ వ్యతిరేక ప్రజా ఉద్యమాలు చేపట్టాలని సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు పిలుపునిచ్చారు. శనివారం ప్రొద్దుటూరు గ్రామంలో సాయుధ పోరాట యోధుడు తాళ్లపల్లి రాములు స్థూపం వద్ద వారోత్సవాలను ఆయన ప్రారంభించి, రాములు విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటాన్ని బీజేపీ హైజాక్ చేసేందుకు ప్రయత్నిస్తోందని, రాచరిక నిర్బంధానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాన్ని ముస్లిం రాజుపై హిందువులు చేసిన పోరాటంగా చిత్రీకరిస్తోందని విమర్శించారు. పోరాటంలో అన్ని వర్గాల వారు ప్రాణత్యాగం చేశారని బీజేపీ, ఎంఐఎం గుర్తుంచుకోవాలన్నారు. కమ్యూనిస్టుల వీరోచిత పోరాటాన్ని తట్టుకోలేకే నిజాం సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేశాడని, నాటి పోరాటంలో జమిందార్లు, నిజాం పాలనకు ఎదురొడ్డి సుమారు 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనత కమ్యూనిస్టులదేనని అన్నారు. నాటి వెట్టిచాకిరి, నిరుద్యోగం, దారిద్రం లాంటి పరిస్థితులే నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్నాయని, సెప్టెంబర్ 17ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, ఇతర నాయకులు, తాళ్లపల్లి రాములు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# రాజీ మార్గమే.. రాజా మార్గము

**జిల్లా న్యాయ సేవధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్**




కొత్తగూడెం లీగల్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:

రాజీమార్గమే రాజమార్గమని, రాజీ కాదగిన కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవడం వల్ల కాలం, ధనం ఆదా అవుతాయని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, ఎం. రాజేందర్ అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షి దారులు పరస్పర అంగీకారంతో వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ ఒక అద్భుతమైన వేదికని పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో తీసుకునే నిర్ణయానికి ఎలాంటి అప్పీల్ ఉండదని, దీని ద్వారా ఇరువర్గాల మధ్య సామరస్యం పెరుగుతుందని తెలిపారు. రాజీ కుదిరిన బాధితులకు అవార్డు కాపీను అందజేశారు. కక్షి దారులకు పులిహోర మరియు మంచినీటి సదుపాయాన్ని ఎస్బిఐ బ్యాంకు వారి సౌజన్యంతో అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్, బి. రవికుమార్, వి. వినయ్ కుమార్ కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. కిరణ్ ముదుల్కర్, నోడల్ ఆఫీసర్ రాఘవయ్య న్యాయవాదులు, బ్యాంకు ప్రతినిధులు, కక్షి దారులు ట్రాఫిక్ ఎస్ ఐ, సిబ్బంది, కోర్ట్ పి సి లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# చందా పేరుతో దాడి.. పోలీసులకు ఫిర్యాదు

పాల్వంచ, సెప్టెంబర్ 12 (ప్రభాత వార్త):

వినాయక చందా ఇవ్వలేదని ఓ వ్యక్తిని అడ్డగించి దాడి చేసిన ఘటనపై పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. బాధితుడు గొంది లక్షి మ్మరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 11న ఉదయం సుమారు 9:30 గంటలకు తన తల్లి గొంది పున్నమ్మ (80)ను కారులో బంజారకు తీసుకెళ్తుండగా, రంగాపురం ప్రాంతంలో కొందరు వ్యక్తులు కారును అడ్డగించారు. ఈ సందర్భంగా బానోత్ నరేష్ అలియాస్ నారి అనే వ్యక్తి తనను అసభ్య పదజాలంతో దూషిస్తూ, వినాయక చందా ఇవ్వకుండా వెళ్లనివ్వనని అడ్డుకున్నాడని పేర్కొన్నారు. తల్లి ఆరోగ్య పరిస్థితి బాగాలేదని చెప్పినా వినిపించుకోకుండా మెడపై చేతితో బలంగా కొట్టాడని ఫిర్యాదులో ఆరోపించారు. అక్కడున్న ఇతరులు అతడిని పక్కకు తీసుకెళ్లగా, మిగతావారు ఎలాంటి దాడికి పాల్పడలేదని తెలిపారు. తల్లి ఆరోగ్యం బాగాలేక వెంటనే ఫిర్యాదు చేయలేకపోయానని, శుక్రవారం జరిగిన ఘటనపై శనివారం పాల్వంచ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. తనపై దాడికి పాల్పడిన బానోత్ నరేష్ అలియాస్ నారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితుడు పోలీసులను కోరారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.